# కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ : గురువారం, 16 మే 2024

సంపుటి: 14, సంచిక: 41, పేజీలు 7, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## తిరుపతిలో గంగమ్మ జాతర

వారంపాటు నగరంలో సందడే సందడి



02

## పదిరోజుల పాటు థియేటర్ల బంద్

ఆక్యుపెన్సీ లేకపోవడమే కారణం 02



## హిందూ ముస్లిం తేడా చూపించనని...

# మోడీ ప్రతిజ్ఞ

హిందూ ముస్లిం తేడా చూపించిన రోజు ప్రజా జీవితంలో ఉండే అర్హత ఉండదు: ప్రధాని



### ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయను

అధిక సంతానం ఉన్నవారంతా పేదలే

తన వ్యాఖ్యలు ముస్లిం సమాజం గురించి అంటూ దుష్ప్రచారం

అది ఓ వర్గానికే అంటగట్టడం తగదు

చూసుకో గలిగినంతమంది సంతానాన్నే కనాలి కానీ వారిని ప్రభుత్వం చూసుకునే పరిస్థితి ఉండకూడదు

ప్రధాని మోడీ స్పష్టీకరణ

*వారణాసి మే15(నిఘా న్యూస్):* తానెప్పుడూ ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడలేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. నేను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను. సబ్‌కా సాథ్‌సబ్‌కా వికాస్‌ను బలంగా నమ్ముతాను. నా మాటలపై జరిగిన దుష్ప్రచారం చూసి షాక్ అయ్యానని అన్నారు. తన వ్యాఖ్యలు పేదవారి అవస్థల గురించి మాత్రమేనని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. తన వ్యాఖ్యలను ముస్లిం సమాజం గురించి అంటూ వక్రీకరించి జరిపిన దుష్ప్రచారం చేయడంపై ఆశ్చర్యపోయానన్నారు. చిన్నప్పుడు తమ ఇంట్లో ఈద్ పండగను కూడా నిర్వహించేవారమని ఎక్కువమంది పిల్లలు గురించి మాట్లాడినప్పుడు అది ముస్లింల గురించి అని ఎవరు చెప్పారని అన్నారు. పేద కుటుంబాల్లోనూ ఇదే పరిస్థితి. కొన్ని కుటుంబాల్లో వారి సామాజిక పరిస్థితితో సంబంధం లేకుండా అధిక సంతానం ఉంది. అది ఏ వర్గం అని నేను ప్రస్తావించలేదు. చూసుకో గలిగినంతమంది సంతానాన్నే కనాలి కానీ..వారిని ప్రభుత్వం చూసుకునే పరిస్థితి ఉండకూడదని మాత్రమే మిగతా2లో..

## త్వరలో పివోకె స్వాధీనం

జిహాద్‌కు లేదా వికాస్‌కు ఓటు వేస్తారా

పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో భాగమే

దానిని విలీనం చేసుకోవడమే తరవాయి

ఎన్నికల ప్రచారంలో అమిత్ షా స్పష్టీకరణ



*కోల్‌కతా మే 15(నిఘా న్యూస్):* పాక్ ఆక్రమిత కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మరోమారు స్పష్టం చేశారు. దీనిని భారత్‌లో విలీనం చేస్తామని ప్రకటించారు. బుధవారం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలను ప్రస్తావిస్తూ.. పీవోకే భారత్‌లో భాగమే. మేం దానిని తీసుకుంటామని అన్నారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఒకప్పుడు సమస్యాత్మకమైన కాశ్మీర్‌లో శాంతి నెలకొందని పశ్చిమ బెంగాల్ సేరంపోరే నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా ప్రసంగించారు. ఇప్పుడు మిగతా2లో..

## ముంబైలో ప్రచారానికి మాధవి లత

రిగ్గింగ్ జరిగిన ప్రాంతాలలో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ 02

రిగ్గింగ్ ఆపడానికి వెళ్లిన నాపై వేల మంది రౌడి మూకలు దాడి

హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత





## బ్రిటన్ ఎన్నికల్లో తెలుగు వ్యక్తి పోటీ

లేబర్ పార్టీ నుంచి రంగంలో ఉన్న ఉదయ్ నాగరాజు

కరీంనగర్ జిల్లా శనిగరరం సొంతూరు

*లండన్ మే15 (నిఘా న్యూస్):* బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి తెలుగు వ్యక్తి ఎంపికయ్యారు. అతను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరంకు మిగతా2లో..

## దేశంలోనే... అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణం

34 వేల కోట్ల కుంభకోణంలో డిహెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ డైరెక్టర్ అరెస్ట్ 02

17 బ్యాంకులను మోసం చేసిన నిందితుడు



## ఉమ్మడి పౌరసత్వ చట్టం అమలు

తొలిసారిగా 14 మందికి భారతీయ పౌరసత్వం

సీఏఏ చట్టం ప్రకారం ద్వారా ధృవీకరణ పత్రాల జారీ



**న్యూఢిల్లీ మే15 (నిఘా న్యూస్):** పౌరసత్వ సవరణ చట్టం కింద మొదటిసారిగా 14 మందికి పౌరసత్వ ధవీకరణ పత్రాలను జారీ చేశారు. కేంద్ర టంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా సర్టిఫికేట్లను అందించారు. సీఏఏ ప్రకారం బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర మైనారిటీలు అయిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రిస్టియన్స్, పార్సీలు, జైన మతస్తులకు ఈ చట్టం ద్వారా భారత పౌరసత్వాన్ని మిగతా2లో..



## ఓటమి భయంతోనే ఎపిలో అల్లర్లు

కఠినంగా అణచి వేయాల్సిందే

ఎపిలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 02

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

## ఏపీ ఎన్నికల్లో... 81.86 శాతం పోలింగ్

అత్యధికంగా దర్శిలో 90.91 శాతం, అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం నమోదు

అర్ధరాత్రి రెండు గంటలకు ముగిసిన పోలింగ్

ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

**అమరావతి మే 15(నిఘా న్యూస్):** ఏపీ ఎన్నికల్లో 81.86 శాతం పోలింగ్ నమోదైందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ విరీనా తెలిపారు. ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్‌తో 1.2 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. బుధవారం నిర్వహించిన విరీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 3500 కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలు దాటాక కూడా పోలింగ్ కొనసాగిందని చెప్పారు. ఆఖరి పోలింగ్ కేంద్రంలో రాత్రి 2 గంటలకు ముగిసిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మిగతా2లో..



## రైతులకు అన్యాయం చేస్తే... బిఆర్ఎస్ రోడ్డెక్కుతుంది



రైతులపై ఇంత తీవ్రమైన నిర్లక్ష్యం తగదు 02

తడిసిన ధాన్యం కొనడంలో ఎందుకీ ఉదాసీనత

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్

## ఏపీ డీజీపీ సీఎస్‌లకు... ఈసీ సమన్లు



ఎన్నికల హింసపై ఇసి సీరియస్

ముందే హెచ్చరికలు ఉన్నా ఎందుకింత ఉదాసీనత

వెంటనే వివరణ ఇవ్వడానికి రండి

ఏపి సిఎస్, డిజిపిలకు ఇసి ఆదేశం

**న్యూఢిల్లీ మే 15(నిఘా న్యూస్):** పల్నాడు, చంద్రగిరి సహా పలు హింసాత్మక ఘటనలపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల్లోనూ, అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి వివరణ ఇవ్వాల్సిందిగా ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాలను ఆదేశించింది. ఈ ఘటనలపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఈసీ సమన్లు పంపింది. హింసాత్మక ఘటనలు జరుగుతాయని ముందే హెచ్చరికలు ఉన్నా .. పోలింగ్ రోజు అంత నిర్లిప్తంగా ఎందుకు వ్యవహరించారని ఈసీ ప్రశ్నించినట్టు మిగతా2లో..



## జార్ఖండ్‌లో మంత్రి ఆలమ్ అరెస్ట్

మంత్రి పర్సనల్ సెక్రటరీ సహాయకుడి నివాసంలో రూ.35 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న ఈడీ 02

## టియర్ గ్యాస్‌తో ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్

జెసి ప్రభాకర్‌కు అస్వస్థత

హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స 02



## ఉమ్మడి పౌరసత్వ చట్టం అమలు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించనున్నారు. 2019లో ఈ చట్టం ఆమోదం పొందినప్పటికీ, ఇటీవలే దీనిని అమలులోకి తీసుకువచ్చారు. 2019లో సీఏఏని పార్లమెంట్ ఆమోదించింది. అయితే నాలుగేళ్ల తర్వాత ఈ ఏడాది మార్చి 11న కేంద్ర హోంవ్యవహారాల మంత్రిత్వ శాఖ నిబంధనల నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ప్రాసెస్ చేసిన తర్వాత బుధవారం 14 మంది పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలను పొందారు. సర్టిఫికెట్లను కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అందజేశారు. పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రాసెస్ చేసిన తర్వాత సర్టిఫికేట్లు అందించారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా వివక్ష ఎదుర్కొంటున్న వారి కోసం 1955 పౌరసత్వ సవరణ చట్టాన్ని సవరించి సీఏఏని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది.

## ఓటమి భయంతోనే ఎపిలో అల్లర్లు

**న్యూఢిల్లీ మే 15(నిఘా న్యూస్):** ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని.. ఎన్డీఏ కూటమి గెలుస్తుందని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఏపీలో అల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఏపీలో కొంత నిరాశ, నిస్పృహ ఉండొచ్చని అందుకే అల్లర్లు జరిగి ఉండొచ్చని తెలిపారు. తెలంగాణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పుకొచ్చారు. ప్రజల్లో మార్పు రావడంతో అభ్యర్థులు గొడవకు దిగారని అన్నారు. ప్రజలు ఎవరు రిజర్వేషన్ల అంశాన్ని నమ్మలేదని చెప్పారు. నామినేషన్ ఉపసంహరణ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ మాటలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్ గుర్తు మారిపోయిందేమో ప్రజలు ఆ పార్టీ గుర్తు గాడిద గుడ్డు అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. ప్రతి ఇంటికి కరపత్రం వెళ్లిందని.. 100 రోజుల్లో అన్ని అమలు చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఒక్క బస్సు పథకం మాత్రమే నడుస్తుందని దానికి ఆర్టీసీకి నిధులు చెల్లించడం లేదని అన్నారు. మహిళలకు రూ.2 వేలు, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ. 12 వేలు, తులం బంగారం అన్నారని.. వాటిని కూడా ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. 420 హామీలు రేవంత్ రెడ్డి ఇచ్చారని, ఇచ్చిన హామీలపై రేవంత్ దృష్టి పెట్టాలని అన్నారు.ఎన్నికల ముందు రేవంత్ మోదీని విమర్శించారని చెప్పారు. ప్రజలు జూన్ 4న దానికి ఫలితం ఏ రకంగా ఉండబోతుందో చూస్తారని తెలిపారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలనిప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## ముంబైలో ప్రచారానికి మాధవి లత

**హైదరాబాద్ మే 15(నిఘా న్యూస్):** హైదరబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంఐఎం నేతలు అక్రమ రిగ్గింగ్ కు పాల్పడ్డారని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత ఆరోపించారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడుతూ రిగ్గింగ్ చేసి గెలిచే గెలుపు కూడా ఒక గెలుపేనా అని విమర్శించారు. 16 సంవత్సరాల ముస్లిం బాలిక రెండు సార్లు ఓటు వేయడానికి వచ్చి దొరికిందని, ఆ బాలిక పై కేసు నమోదు చేయకుండా తల్లితండ్రులకు అప్పగించి పంపించారని ఆమె ఆరోపించారు. రిగ్గింగ్ ఆపడానికి వెళ్లిన నాపై వేల మంది రౌడి మూకలు దాడికి యత్నించారని, రిగ్గింగ్ జరుగుతున్నా అక్కడ ఉన్న పోలీసులు స్పందించలేదని మాధవీ లత మండిపడ్డారు. ఇది భారత దేశమేనా.. ఇక్కడ 144 సెక్షన్ ఉండదా అని ఆమె ప్రశ్నించారు. ఈ రిగ్గింగ్ పై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, అవసరమైతే రీ పోలింగ్ పెట్టడానికి ఎంత దూరమైనా వెళ్ళడానికి సిద్ధమని ఆమె వెల్లడించారు. రేపు ముంబైలో ప్రచారానికి వెళ్ళాలని పార్టీ ఆదేశించిందని అక్కడికి వెళ్తున్నట్లు తెలిపారు. ఇదిలాఉంటే పోలింగ్ రోజు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వివిధ పోలింగ్ బూత్‌ల్లో పర్యటించిన మాధవీలత.. రిగ్గింగ్ జరుగుతుందనే అనుమానంతో ఓ ముస్లిం మహిళను బురాఖా తీసి ఆమె ముఖాన్ని ఓటర్ స్లిప్‌లో ఉన్న ఫొటోతో సరిపోల్చి చూశారు. ఈ ఘటన వివాదస్పదంగా మారడంతో కన్నెర్రజేసిన ఈసీ ఆమెపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈసీ ఆదేశాలతో ఆమెపై మలక్ పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగానే హైదరాబాద్‌లో రిగ్గింగ్ జరిగిందని రీ పోలింగ్ నిర్వహించాలని మాధవీలత డిమాండ్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆమె డిమాండ్‌పై ఈసీ ఏ విధంగా రియాక్ట్ అవుతుందనేది స్టేట్ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## టియర్ గ్యాస్‌తో ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్

**అనంతపురం మే 15 (నిఘా న్యూస్):** అనంతపురం జిల్లా తాడిపత్రిలో మంగళవారం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. దాని ప్రభావంతో మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి సికింద్రాబాద్ కిమ్ చికిత్స పొందుతున్నారని ఆయన కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు. ఆయన్ను చూసేందుకు కార్యకర్తలు రావొద్దని విజ్ఞప్తి చేశారు. వైద్య నిర్ధరణ పరీక్షలు పూర్తయిన తర్వాత బులెటిన్ విడుదల చేస్తామని వైద్యులు ప్రకటించారు.

టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. తాడిపత్రిలో టియర్ గ్యాస్ ఎఫెక్ట్ వల్లే జేసీ అనారోగ్యానికి గురయ్యారు. ఆందోళనకారులను చెదరగొట్టడంలో భాగంగా నిన్న కాంచన ఆసుపత్రి సమీపంలో పోలీసులు టీయర్ గ్యాస్ ప్రయోగించారు. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి సమీపంలో టియర్ గ్యాస్ పడింది. దీంతో టియర్ గ్యాస్ ఎఫెక్ట్‌తో జేసీ లంగ్స్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి చికిత్స పొందుతున్నారు.

## బ్రిటన్ ఎన్నికల్లో తెలుగు వ్యక్తి పోటీ

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఉదయ్ నాగరాజు. యూకేలోని లేబర్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. నార్త్ బెడ్ ఫోర్డ్ర్ లేబర్ పార్టీ పార్లమెంటరీ అభ్యర్థిగా పార్టీ ప్రకటించింది. నార్త్ బెడ్ ఫోర్డ్ర్ అనేది అక్కడి బౌండరీ కమిషన్ సూచనతో కొత్తగా ఏర్పడ్డ పార్లమెంట్ నియోజకవర్గం. అయితే, యూకేలోని ప్రఖ్యాత సర్వే సంస్థ ఎలెక్టోరల్ కాల్కులస్ ప్రకారం నియోజకవర్గంలో 68 శాతం లేబర్ పార్టీ గెలువబోతుందని అంచనా వేసింది. ప్రస్తుతం బ్రిటన్ లోనూ ఎన్నికల హడావిడి మొదలయింది. భారతదేశంలో ఇప్పటికే ఎన్నికలు జరుగుతుండగా ఈ సంవత్సరంలోనే బ్రిటన్, అమెరికాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ పాలస్తీనా సంఘర్షణ, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో జరుగుతున్న బ్రిటన్, అమెరికా ఎన్నికల వీరిద ప్రపంచ దేశాల దృష్టి ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో ఉదయ్ నాగరాజు జన్మించారు. శనిగరం గ్రామానికి చెందిన నాగరాజు హనుమంతరావు, నిర్మలాదేవి దంపతుల కుమారుడు. చిన్నప్పటి నుంచే కష్టపడేతత్వం కలిగి ఉండే ఉదయ్ అంచెలంచాలుగా ఎదిగారు. బ్రిటన్ లోని ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్ లో పాలనా శాస్త్రంలో పీజీ చేశారు. ప్రపంచ సమాజం, భావితరాలపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రభావం ముందుగానే పసిగట్టి ఏఐ పాలసీలాబ్స్ అనే థింక్‌ట్యాంక్ ని నెలకొల్పారు. అంతర్జాతీయ వక్తగా, రచయితగా మంచి పేరు సంపాదించారు ఉదయ నాగరాజు. క్షేతస్థాయి సమస్యలపైన ఉదయ్ కు మంచి పట్టు ఉంది. స్కూల్ గవర్నర్ గా, వాలంటీర్ గా, విస్తృత రాజకీయ ప్రచారకుడిగా ఒక దశాబ్దకాలంగా ఇంటింటికీ ప్రచారంతో సామాన్యుల కష్టాలపై మంచి అవగాహన సాధించారు. దాదాపు అన్ని సర్వే సంస్థల ప్రకారం ఈ ఎన్నికల్లో లేబర్ పార్టీ అఖండ విజయం సాధించి ప్రభుత్వాన్ని నెలకొల్పనుంది. ప్రఖ్యాత తెలుగు రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా ఈ సర్వేల ఆధారంగా కన్సర్వేటివ్ పార్టీ కనీవిని ఎరుగని రీతిలో ఓడిపోయి లేబర్ పార్టీ గెలుస్తుందని విశ్లేషించారు. గత కొన్ని ఎన్నికల్లోనూ లేబర్ పార్టీ ఎంపీలు వరుసగా గెలుస్తూ వస్తున్నారు. ఈ నెల జరిగిన కౌన్సిలర్, రాష్ట్ర మేయర్ ఎన్నికలోనూ లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. దీనితో తెలుగు బిడ్డ ఉదయ్ నాగరాజు కూడా బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఘన విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తుంది.

# తిరుపతిలో గంగమ్మ జాతర



**తిరుపతి మే 15(నిఘా న్యూస్):** మొన్నటి వరకూ ఎన్నికల ప్రచారాలతో మోతెక్కిన తిరుపతి నగర విధులు.. ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో జరిగే ప్రముఖ జాతరల్లో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతీ ఏటా మే నెలలో ఏడు రోజుల పాటు జాతర నిర్వహించటం జరుగుతుంది. గత అర్ధరాత్రి చాటింపుతో తిరుపతి గ్రామ దేవతగా పిలుచుకొనే చిన్నగంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 21వ తేదీ వరకు ఏడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. 22వ తేదీన తెల్లవారు జామున అమ్మవారి విశ్వరూప దర్శనం, చెంప నరికే కార్యక్రమంతో జాతర ముగియనుంది. ఏడు రోజుల పాటు వివిధ వేషాలలో గంగమ్మను భక్తులు దర్శించుకోనున్నారు.గంగమ్మ జాతర ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌తోపాటు డీఆర్వోను సమన్వయం చేసుకుని ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా జాతర సందర్భంగా శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. జాతర ముగింపు రోజు భక్తుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సంప్రదాయం ప్రకారం కైకాల వంశస్తులు తిరుపతి గంగజాతర సందర్భంగా అర్ధరాత్రి గ్రామంలో చాటింపు పూజ నిర్వహించి నగర శివారు ప్రాంతాలలో అష్టదిగ్బంధనం చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. జాతర ప్రారంభం కావడంతో అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహిస్తారు. బైరాగివేషంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. 16బండ వేషం, 17న తోటి వేషం, 18న దొర వేషం, 19న మాతంగి వేషం, 20న సున్నపు కుండలు, 21న గంగమ్మకు చప్పరం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక 22న విశ్వరూప దర్శనం తర్వాత చెంప నరికే కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. అలాగే తిరుపతి గ్రామ దేవత గంగమ్మ జాతరలో మరో విశేషం ఉంది. జాతర జరిగినన్ని రోజులు గ్రామస్తులు ఊరి విడిచి వెళ్లరు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా రాత్రుళ్లు బస చేయకుండా వెళ్లిపోవడం ఇక్కడి ఆచారం. తాతయ్యగుంట గంగమ్మ జాతరకు 900 ఏళ్ల చరిత్ర ఉంది. గ్రామదేవతగా అవతరించిన గంగమ్మను సాక్షాత్తు తిరుమల శ్రీవారి చెల్లెలుగా కొలుస్తారు.

### హిందూ ముస్లిం తేడా చూపించనని...

# మోడీ ప్రతిజ్ఞ

(మొదటిపేజీ తరువాయి)

చెప్పాను అంటూ మోదీ స్పష్టత ఇచ్చారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో అల్లర్లు జరిగినప్పుడు మోదీ ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తన ప్రత్యర్థులు ముస్లిం వర్గంలో తన ప్రతిష్ఠను దెబ్బతీశారని దుయ్యబట్టారు. 'చిన్నప్పుడు మా ఇంటి చుట్టుపక్కల ఎన్నో ముస్లిం కుటుంబాలు ఉండేవి. మా ఇంట్లో కూడా మిగతా పండగలతో పాటు ఈద్ కూడా నిర్వహించేవాళ్లం. ఈద్ రోజున మా ఇంట్లో వంట చేసుకునేవాళ్లం కాదు. ఆ వర్గానికి చెందిన కుటుంబాలే మాకు ఆహారం తెచ్చిఇచ్చేవి. అలాగే మొహర్రంలోనూ భాగమయ్యేవాళ్లం. అలాంటి ప్రపంచంలో నేను పెరిగాను. నా స్నేహితుల్లో చాలా మంది ముస్లింలు ఉన్నారని వెల్లడించారు. అలాగే ఈ ఎన్నికల్లో ఆ వర్గం నుంచి ఓట్లు పడతాయా? అని ప్రశ్నించగా..ఈ దేశ ప్రజలు తనకు ఓటు వేస్తారని సమాధానం ఇచ్చారు. హిందూ ముస్లిం అంటూ తేడా చూపడం ప్రారంభించిన రోజు.. ప్రజాజీవితంలో ఉండే అర్హత తనకు ఉండదన్నారు. అలాంటి తేడా ఎన్నటికీ చూపనంటూ ప్రతిజ్ఞ చేశారు. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. 'ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చెప్పింది. ఆ మేరకు దేశ సంపదనంతా చొరబాటు దారులకు, ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంచుతారు. వీరి ఆస్తులను జప్తు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉందా అర్బన్ నక్సలిజం మనస్తత్వం ఉన్న ఆ పార్టీ నాయకులు మహిళల మంగళసూత్రాలను కూడా వదలరు. వీరి కష్టార్జితం చొరబాటుదారుల పాలవడం వీరికు సమ్మతమేనా' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై ప్రధాని మోడీ విమర్శలకు వివరణ ఇచ్చారు.

# ఏపీ డీజీపీ సీఎస్‌లకు... ఈసీ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. ఈ వ్యవహారంపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ఈమేరకు ఇద్దరు అధికారులు గురువారం ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల కమిషన్ ముందు హాజరై వివరణ ఇవ్వనున్నారు. ఎన్నికలతో పాటు అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపట్ల స్థానిక అధికారులు నిర్లిప్తంగా, నిర్లక్ష్యంగా వదిలేసినట్టు ఈసీ గుర్తించింది. పల్నాడులో స్వయంగా పర్యటించిన ఏపీ ప్రత్యేక అబ్జర్వర్ రామ్మోహన్ మిశ్రా ఈ అంశాలను నేరుగా సీఈసీకి నివేదించినట్టు తెలుస్తోంది. పోలింగ్ అనంతరం మంగళవారం తాడిపత్రి, తిరుపతి, కారంపూడి రణరంగంగా మారాయి. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఆవరణలో వైకాపా నాయకులు మారణాయుధాలతో రెచ్చిపోయారు. ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించేందుకు వచ్చిన చంద్రగిరి తెదేపా అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం చేశారు. చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి. ఆయన కుమారుడు, ప్రస్తుతం పార్టీ అభ్యర్థి మోహిత్‌రెడ్డిల అనుచరులు సమ్మెట, కర్రలు, రాళ్లు, బీరు సీసాలతో దాడులు చేస్తూ వీరంగం సృష్టించారు. నానితోపాటు ఆయన డ్రైవర్, గన్‌మెన్లపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. తేరుకునేలోగానే దుండగులు దాడి చేయడంతో గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరిపారు. వెరవకుండా వైకాపా మూకలు దాడిని కొనసాగించడంతో నాని భుజానికి గాయాలయ్యాయి. గన్‌మెన్ తలకూ తీవ్రగాయమైంది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడిలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన అనుచరులతో విధ్వంసం సృష్టించారు. తన కారుపై ఎవరో రాయి వేశారనే నెపంతో తెదేపా కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కారంపూడి వీరీదుగా వెళ్తుండగా ఆయన కాన్వాయ్‌లోని ఓ కారుపై గుర్తుతెలియని వ్యక్తి రాయి విసిరాడనే నెపంతో ఆగ్రహంతో ఊగిపోయారు. సమీపంలోనే ఉన్న తెదేపా కార్యాలయం వైపు కాన్వాయ్ వెళ్లి ఆగింది. కార్లలో ఉన్న వైకాపా గూండాలు కర్రలు, కత్తులు, రాడ్లు బయటకు తీసి తెదేపా కార్యాలయంలోకి దూసుకెళ్లారు. కుర్చీలను పగలగొట్టారు. రాళ్లు విసిరారు. ఫ్లెక్సీలను చించేశారు. తలుపులు ధ్వంసం చేశారు. అటుగా కారులో వెళ్తున్న తెదేపా కార్యకర్త మస్తాన్ జానీబాషా కుమారుడు బుడ్డు, షేక్‌జాన్‌ను అడ్డుకున్నారు. వారిని బయటకు రప్పించి దాడి చేసి, ఆపై కారుకు నిప్పుపెట్టారు. రోడ్లపై తిరుగుతూ బీభత్సం సృష్టించారు. దుకాణదారులపైనా దాడులకు తెగబడ్డారు. పున్నమ్మ తోపుడు బండిని విరగ్గొట్టారు. అక్కడే కూర్చొని ఉన్న ఆమె కుమార్తె, మనవరాలిపై దాడి చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎన్నికల ముందు అన్నట్లుగానే విధ్వంసకాండను సృష్టించారు. తాడిపత్రిని యుద్ధభూమిగా మార్చారు. తాడిపత్రిలోని చింతలరాయుని పాళెంలో ఉన్న వైకాపా ఏజెంట్లు సంజీవ, అజయ్, మరో నలుగురు కలసి తెదేపా ఏజెంట్ భాను, ఆ పార్టీ వర్గీయుడు మోహన్‌లపై దాడికి దిగారు. అంతలో తెదేపా నాయకుడు సూర్యముని అనుచరులు వైకాపా ఏజెంట్ సంజీవను నిలదీయగా అతను ఎమ్మెల్యే పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. ఎమ్మెల్యే ఆవేశంతో ఊగిపోయి నా వర్గీయుడినే ప్రశ్నిస్తారా? అని తన అనుచరులతో సూర్యముని ఇంటి వద్దకు వెళ్లి రాళ్లదాడికి దిగారు. స్పెషల్ కమాండెంట్ శ్రీనివాసరావు.. బలగాలతో వెళ్లి అల్లరి మూకలను చెదరగొట్టారు. వైకాపా మూకల దాడిలో ఆయనతోపాటు పట్టణ సీఐ మురళీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి.

ఇద్దరు కానిస్టేబుళ్లూ గాయపడ్డారు. ఈ విషయం తెలియగానే మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూర్యముని ఇంటి వద్దకు వచ్చి పరామర్శించారు. ఆ తర్వాత తెదేపా వర్గీయులు పెద్దారెడ్డి అరాచకాన్ని నిరసిస్తూ రాస్తారోకో చేశారు. అనంతరం అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోకి చేరుకోగా, అక్కడ దాడికి పక్కా వ్యూహంతో ఉన్న వైకాపా వర్గీయులు ట్రాక్టర్లతో రాళ్లను తెప్పించుకుని తెదేపా వారిపైకి విసిరారు. కేంద్ర బలగాలు రంగ ప్రవేశం చేసి అల్లరి మూకలను చెదరగొట్టాయి.

# రైతులకు అన్యాయం చేస్తే... బిఆర్ఎస్ రోడ్డు ఎక్కుతుంది




**హైదరాబాద్ మే 15(నిఘా న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరించి రాజకీయాలపైనే దృష్టి పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. రైతులు ఆందోళన చెందుతున్నా చీమకుట్టినట్లుగా లేదన్నారు.

బుధవారం మీడియాతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ల పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. తరుగు పేరుతో క్వింటాల్‌కు మూడు కేజీలు తీస్తున్నారని రైతులకు అన్యాయం చేయొద్దని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ రోడ్డెక్కి ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. గతంలో తరుగుపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు ఇప్పుడు ఎందుకు పట్టించుకోరని అన్నారు. ఇకపోతే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నాలుగు సార్లు బీఆర్ఎస్ మాత్రమే గెలిచిందని తెలిపారు. కేసీఆర్‌కు బలాన్ని చేకూర్చేలా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మెగా డీఎస్సీ దగా అయిందన్నారు. ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు తానే ఇచ్చినా అని రేవంత్ రెడ్డి అబద్దాలు చెబుతున్నారన్నారు. ప్రశ్నించే గొంతు పార్టీ ఉంటేనే ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు. ఒక బ్లాక్ మెయిలర్‌ను కాంగ్రెస్ పార్టీ పోటీలో పెట్టిందని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే నల్గొండలో నయీమ్ లాంటి వ్యక్తిని తయారు చేసినవాళ్ళం అవుతామన్నారు. ఉద్యోగులను ముఖ్యమంత్రి నిందించటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి దిక్కుమాలిన మాటలు మాట్లాడొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ ఖేడ్‌లో టీచర్లపై లాఠీ ఛార్జ్ చేస్తారా అంటూ మండిపడ్డారు. మూడు లక్షల ఎనభై కోట్ల అప్పు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసిందని రిజర్వ్ బ్యాంకు నివేదిక రిలీజ్ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్లు అంటూ ఫేక్ ప్రచారం చేస్తోందన్నారు. దీనికి సీఎం, డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఊసరవెల్లిలా మాట్లాడుతున్నారన్నారు. హైదారాబాద్ విషయంలో బీజేపీ ఏం చేయబోతుందో జూన్ 4 తర్వాత తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## పదిరోజుల పాటు థియేటర్ల బంద్

**హైదరాబాద్ మే15(నిఘా న్యూస్):** సినిమా అనేది సగటు ప్రేక్షకుడికి ఆహ్లాదం.. ఆనందాన్ని ఇస్తుంది. ప్రతీరోజు ఎంతో కష్టపడుతూ ఉండే మనిషికి సినిమా కొంత రిలీఫ్‌ను ఇస్తుందని చెప్పవచ్చు. వీకెండ్ వచ్చిందంటే చాలు చాలా మంది సినిమాలకు వెళుతుంటారు. అయితే ఇటీవల తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కారణంగా పెద్ద హీరోల సినిమాలు రిలీజ్ కాని పరిస్థితి. దీంతో థియేటర్లు వెళ్లే వారి సంఖ్య తగ్గిపోయింది. ఈ క్రమంలో తెలుగు ప్రేక్షకులకు తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ ఊహించని షాక్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో పది రోజులపాటు థియేటర్లు బంద్ కానున్నాయి. ఆక్యుపెన్సీ తక్కువ ఉండటంతో తెలంగాణ రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు తాత్కాలిక విరామం ప్రకటించాయి. శుక్రవారం నుంచి పది రోజులపాటు షోలు వేయవద్దని తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు అలాగే ఇతర కారణాలతో ఇటీవల పెద్ద సినిమాలు రిలీజ్ కావడం లేదు. దీంతో సినిమా హాళ్ళకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నగరాలతో పోలిస్తే పట్టణాలు అలాగే మండలాలలో ఇది మరింత దారుణంగా ఉందంటూ.. తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ ఈమేరకు నిర్ణయం తీసుకుంది.

## జార్ఖండ్‌లో మంత్రి ఆలమ్ అరెస్ట్

**రాంచీ మే15(నిఘా న్యూస్):** మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ గ్రావిరీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత అలంగీర్ ఆలమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం అరెస్టు చేసింది. ఈ కేసులో ఆలమ్‌ను సుమారు తొమ్మిది గంటల సేపు ప్రశ్నించిన ఈడీ అధికారులు అయన నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో అరెస్టు చేసింది. మంత్రి పర్సనల్ సెక్రటరీ సంజీవ్ లాల్ ఇంటి సహాయకుడు జహంగీర్ ఆలమ్ నివాసంలో రూ.35 కోట్ల నగదును ఈడీ ఇటీవల స్వాధీనం చేసుకుంది. అనంతరం ఆ ఇద్దరినీ అరెస్టు చేసింది. కాగా, గ్రావిరీణ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం కోసం వేసిన టెండర్‌కు అనుమతించినందుకు ప్రతిగా రూ.35 కోట్లు కమిషన్‌గా తీసుకున్నట్టు ఈడీ అనుమానిస్తోంది. లంచం సొమ్ముకు కేర్‌టేకర్‌గా తనను ఉంచారని, ఇందుకు గాను నెలకు రూ.15 చొప్పున వేతనం ఇస్తున్నారని జహంగీర్ ఆలమ్ ఈడీ ప్రాథమిక ఆచరణలో అంగీకరించినట్టు తెలుస్తోంది. సంజీవ్ కుమార్ లాల్ రాంచీలోని సర్ సైయద్ రెసిడెన్స్ అపార్ట్‌మెంట్స్‌లో అద్దెకు ఉంటూ డబ్బుల కట్టలున్న బ్యాగ్‌ను తరచు జహంగీర్‌కు ఇచ్చేవాడని, అక్కడి కప్ బోర్డులో అతను ఉంచేవాడని తెలుస్తోంది. అయితే, ఎలాట్‌లో దొరికిన సొమ్ము తనది కాదని సంజీవ్ లాల్ మొదట బుకాయించాడని, జహంగీర్ ఇచ్చిన సాక్ష్యంతో ఆయనను ఏజెన్సీ అరెస్టు చేసిందని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో పట్టుబడిన సొమ్ముపై బుధవారం మధ్యాహ్నం 11 గంటలకు రాంచీలోని ఈడీ కార్యాలయానికి వచ్చిన అలంగీర్ ఆలమ్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించిన ఈడీ ఆయన నుంచి సంతృప్తికరమైన సమధానం రాకపోవడంతో వెంటనే అదుపులోనికి తీసుకుంది.

## ఏపీ ఎన్నికల్లో... 81.86 శాతం పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఈవీఎంలన్నీ 350 స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. కొన్నిచోట్ల వర్షం వల్ల పోలింగ్ ఆలస్యమైందని చెప్పారు. అబ్జర్వర్లంతా పరిశీలన చేశారని రీపోలింగ్‌పై ఏవిరీ చెప్పలేదని సీఈవో వివరించారు. గత ఎన్నికలతో పోలిస్తే 2.09 శాతం పోలింగ్ పెరిగిందని వీరీనా తెలిపారు. 2014లో 78.41 శాతం, 2019లో 79.77 శాతం నమోదైందని చెప్పారు. ఈ ఎన్నికల్లో అత్యధికంగా దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో 90.91 శాతం, అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం నమోదైనట్లు వివరించారు. లోక్‌సభ స్థానాల్లో అత్యధికంగా ఒంగోలులో 87.06 శాతం, అత్యల్పంగా విశాఖ లోక్‌సభలో 71.11 శాతం పోలింగ్ నమోదైనట్లు సీఈవో చెప్పారు.

## త్వరలో పివోకె స్వాధీనం



(మొదటిపేజీ తరువాయి)

పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఆజాదీ నినాదాలు, నిరసనలతో ప్రతిధ్వనిస్తుంది. 2019లో ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసి కాశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించింది. అయితే ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలు జరుగుతున్నాయి. ఇంతకుముందు ఇక్కడ ఆజాదీ నినాదాలు వినిపించగా, ఇప్పుడు పీఓకేలో కూడా అదే నినాదాలు వినిపిస్తున్నాయి. ఇంతకు ముందు ఇక్కడ రాళ్లు రువ్వేవారని, ఇప్పుడు పీఓకేలో రాళ్లు రువ్వుతున్నారు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చొరబాటుదారులు కావాలా లేదా శరణార్థులకు సీఏఏ కావాలా అనేది పశ్చిమ బెంగాల్ నిర్ణయించుకోవాలి. జిహాద్‌కు ఓటు వేయాలా లేదా వికాస్‌కు ఓటు వేయాలా అనేది బెంగాల్ నిర్ణయించుకోవాలి అని అమిత్ షా పిలునిచ్చారు.

# దేశంలోనే... అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణం



**న్యూఢిల్లీ మే15 (నిఘా న్యూస్):** దేశంలో బ్యాంకింగ్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు పెద్ద ఎత్తున బ్యాంకు మోసాలకు పాల్పడగా, వారిపై కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. వారు విదేశాల్లో తలదాచుకుని తప్పించుకుని ఉన్నారు. ఇప్పుడు మరో బ్యాంకు కుంభకోణం చోటు చేసుకుంది. 34 వేల కోట్ల బ్యాంకు మోసం కేసులో డిహెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధవాన్‌ను సిబిఐ అరెస్టు చేసింది. ధీరజ్ వాధవాన్‌ను అరెస్టు చేసిన తర్వాత, ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వాధవన్ 17 రుణ బ్యాంకులతో ఈ మోసానికి పాల్పడ్డాడు. ఇది ఇప్పటివరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ మోసం. 34,000 కోట్ల విలువైన 17 బ్యాంకుల కన్సార్టియం మోసానికి సంబంధించి సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బ్యాంకుల కన్సార్టియంకు నాయకత్వం వహిస్తోంది. 2022లోనే బ్యాంకు మోసం కేసులో ధీరజ్ వాధావన్ పేరును సీబీఐ ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అదే సమయంలో ఇది దేశ బ్యాంకింగ్ చరిత్రలో అతిపెద్ద మోసంగా పరిగణించబడుతుంది. ఇంతకు ముందు కూడా యెస్ బ్యాంక్ కుంభకోణం కేసులో ధీరజ్ వాధవాన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం అతను ఈ కేసులో బెయిల్‌పై ఉన్నాడు.డిహెచ్‌ఎఫ్‌ఎల్ సిఎండి కపిల్ వాధవాన్, డైరెక్టర్ ధీరజ్ వాధావన్ సహా మొత్తం 74 మంది, 57 కంపెనీలపై సిబిఐ న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆఫ్ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. 17 బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఈవో హర్షిల్ మెహతా పేరును కూడా చార్జ్ షీట్‌లో చేర్చారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదుపై దాఖలు చేసిన కపిల్ వాధవాన్, డైరెక్టర్‌గా ఉన్న ధీరజ్ వాధవాన్, ఇతర నిందితులతో కలిసి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతత్వంలోని 17 బ్యాంకులతో మోసం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొంది. నేరపూరిత కుట్ర చేసి రూ.42,871.42 కోట్ల రుణం ఇవ్వాలని ఈ బ్యాంకులను కోరింది. సీబీఐ ప్రకారం.. జూలై 31, 2020 నాటికి 17 బ్యాంకుల కన్సార్టియం బకాయిల కారణంగా రూ. 34615 కోట్ల నష్టం వాటిల్లిందని

## వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**మౌలాలి, మే 15 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పల్లె దవాఖానలో 15 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలకు, ప్రెగ్నెన్సీ మహిళలకు ఇమ్యునైజేశన్ కోసం ప్రతి బుధవారం నిర్వహించే వాక్సినేషన్ కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ పల్లవి సిబ్బంది పాల్గొన్నారు.

## గాలివాన లేకున్నా నేల కొరుగుతున్న చెట్లు





**నల్లకుంట, మే 15 (నిఘా న్యూస్):** నల్లకుంట డివిజన్ లోని తిలక్ నగర్, గోల్నాక కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఉన్న చెట్లు వరుసగా నేలకూలుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గాలి వాన లేకున్నప్పటికీ మామూలు సమయంలోనే ఈ ప్రాంతాల్లో రెండు పెద్ద చెట్లు నేలకూలాయి. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నెల రోజుల క్రితం తిలక్ నగర్ కిషన్ రావు హాస్పిటల్ ముందు రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా నేలకూరింది. ఆ తర్వాత కొద్ది రోజులకే గోల్నాక కూరగాయల మార్కెట్లో ఉన్న తాటి చెట్టు నేల కూలి పక్కనే ఉన్న భవనంపై ఒరిగి ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతాల్లో వరుసగా చెట్లు నేలకూలుతుండడంతో స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గాలి వానకు చెట్లు కూలడం పరిపాటి. కానీ ఈ ప్రాంతాల్లో గాలివాన లేక పోయినప్పటికీ మామూలు సమయాల్లో చెట్లు నేలకొరగడం అందరినీ విస్మయానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి డిఆర్ఎఫ్ బృందాలు ఈ ప్రాంతాల్లో పర్యటించి నేల కూలే అవకాశమున్న చెట్లను ముందస్తుగా గుర్తించి తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## నేడు హబ్సిగూడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

### విద్యుత్ శాఖ ఏ.ఏ ఈ, ఎన్ రాంరెడ్డి



**హబ్సిగూడ, మే 15 (నిఘా న్యూస్):** శాఖపరమైన మరమ్మత్తుల కారణంగా ఈనెల 16 వ తేదీ గురువారం హబ్సిగూడ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరకు అంతరాయం కలుగుతుందని హబ్సిగూడ విద్యుత్ శాఖ ఏ ఏ ఈ ఎన్ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కె.వి స్నేహపురి కాలనీ ఫీడర్,33/11 కె.వి.ఐ ఐ ఐ సి టి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7:30 గంటల నుండి 8:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్నేహపురి కాలనీ, వీఎస్ టి కాలనీ, శ్రీనగర్ కాలనీ, భవాని నగర్ సీట్ నెంబర్ 3 నుండి 5 వరకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. అలాగే 11 కె.వి. సైంటిస్ట్ కాలనీ ఫీడర్, 33/ 11 కెవి ఎన్ జి ఆర్ ఐ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుండి 8:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ సమయంలో సైంటిస్ట్ కాలనీ నాగేంద్ర నగర్, జహీర్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఏఏ ఈ ఎన్. రాంరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఉప ఎన్నికపై సర్వత్రా చర్చ

### సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా ఉప ఎన్నిక అనివార్యం





**అంబర్ పేట, మే 15 (నిఘా న్యూస్):** సికింద్రాబాద్ లోక్ సభ ఎన్నికల పోలింగ్ పోయడంతో ఇప్పుడు ఉప ఎన్నికలపై చర్చ మొదలైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బిఆర్ఎస్ నుండి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌లు పోటీపడ్డారు. ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. అయితే సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా ఉప ఎన్నిక అనివార్యం కానుంది. కాంగ్రెస్ అభ్యర్థి దానం గెలిస్తే ఖైరతాబాద్ అసెంబ్లీకి, బిఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలిస్తే సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అయిన సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి దానం నాగేందర్ గెలిచి కేంద్రంలో మంత్రి అవుతారని ఆ పార్టీ కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మనిషిగా పేరుందిన తమ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలుస్తారని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి గెలుస్తారని ఇరు పార్టీల కార్యకర్తలు చెబుతుండడంతో ఉప ఎన్నికలపై సర్వత్రా చర్చ నెలకొంది. ఇదిలా ఉండగా 2014, 2019 ఎన్ని కలలో వరుసగా విజయాన్ని సొంతం చేసుకున్న బీజేపీ మరోమారు గెలిచి హ్యాట్రిక్ సాధించనిందని ఆ పార్టీ కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

# లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించండి

- ప్రభుత్వం స్పందించకపోతే మేమే గృహప్రవేశం చేయిస్తాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్



**భువనగిరి, మే 15 (నిఘా న్యూస్):** భువనగిరి కేంద్రంలోని సింగన్నగూడెం వద్ద 2015లో శంకుస్థాపన చేసి నిర్మించిన 565 డబల్ బెడ్ రూమ్ లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం సింగన్నగూడెం లోని డబల్ బెడ్ రూమ్ లను పరిశీలించి పనుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. ఓట్ల రాజకీయాలతో వారికి పట్టాలు ఇచ్చిన ఇండ్లు కేటాయించ లేదన్నారు. కోట్ల రూపాయల సంపదతో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ వినియోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తపరిచారు. త్రాగునీరు డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలన్నారు. డబల్ బెడ్ రూమ్‌ల వద్ద రక్షణ లేకపోవడంతో ఆ ఇంటి కిటికీలను డోర్లను దొంగలు ఎత్తుకు పోతున్నారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్న స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారులు నామమాత్రంగా పరిశీలించారు తప్ప పరిష్కరించలేదన్నారు. డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను ఐక్యం చేసి నిరసన తెలుపడంతో పాటు ఆ గదులను వాటికి పట్టాల ప్రకారం కేటాయించి గృహప్రవేశం చేయిస్తామని హెచ్చరించారు. దీంతో సంపద నష్టపోకుండా ఉండడమే కాకుండా వినియోగంలోకి వస్తుందని జహంగీర్ తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధలు మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ కాలనీకి ప్రభుత్వం నుండి వెంటనే నిధులు కేటాయించి డ్రైనేజీ తాగునీరు ఏర్పాటు చేయించాలన్నారు. చేసిన వెంటనే లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలన్నారు. లబ్ధిదారులకు కేటాయించక పోతే తమ పార్టీ ఆధ్వర్యంలో వారికి కేటాయించి గృహప్రవేశం చేయిస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎమ్మెల్యేలు ఈ విషయంపై స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, మండల కార్యదర్శి దయ్యాల నరసింహ, నాయకులు బందెల ఎల్లయ్య, అన్నంపట్ల కృష్ణ, చింతల శివ పాల్గొన్నారు.

# మదర్ హుడ్ ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవం

### హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్



**మౌలాలి, మే 15 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బి కాలనీలో మదర్ హుడ్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ తో కలిసి వేడుకలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్ యజమాని డా. షేక్ రఫియా మంచి సేవా స్ఫూర్తి గల మంచి వ్యక్తి అని ఈ హాస్పిటల్ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందని, సామాన్య ప్రజలకు సేవా స్ఫూర్తితో తక్కువ ఫీజులతో మంచి చికిత్స అందించాలని, హాస్పిటల్ ప్రజల నుండి మంచి ఆదరణ పొంది ముందుకు సాగాలని కోరారు. స్థానిక ప్రజల నుంచి మంచి ఆదరణ ఉందని దానికి అనుగుణంగా నూతనంగా అధునాతన స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేసి తక్కువ ఫీజులతో సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, మల్లారెడ్డి మల్లేష్ గౌడ్, నవీన్ గౌడ్, జయపాల్ చంద్రశేఖర్, నిసార్ అహ్మద్ గోరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలతో వరుస ప్రమాదాలు

### లారీల వద్ద రాస్తారోకో చేపట్టిన గ్రామస్తులు

### ప్రమాదాలపై చర్యలు తీసుకుంటాం: ఎస్సై కృష్ణ ప్రసాద్



**ఏటూరు నాగారం, మే 15 (నిఘా న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రొయ్యూరు గ్రామ సమీపంలోగల నేషనల్ హైవే 163 పై మంగళవారం రాత్రి మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన గుగ్గిళ్ళ రమేష్ (22) ను ఇసుక లారీ ఢీ కొట్టగా రమేష్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసినదే కాగా మరుసటి రోజు బుధవారం మృతుని కుటుంబ సభ్యులు, రొయ్యూరు, శంకరాజపల్లి గ్రామస్తులు పెద్దెత్తున తరలివచ్చి ఇసుక లారీలను అడ్డుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఏటూరు నాగారం స్థానిక ఎస్సై కృష్ణ ప్రసాద్ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్, యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చి సర్ది చెప్పడంతో మృతుని బంధువులు ప్రజలు రాస్తారోకో విరమింపజేశారు. కాగా ఇసుక క్వారీల వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయక పోవడంతో వందలాది లారీలు రోడ్డుపైనే నిలుపుతున్నారని దానివల్ల ఇటువైపు అటువైపు నుండి వచ్చే వాహన దారులకు ఇబ్బంది కలిగి ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుపైన లారీలు నిలపకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎస్సై కృష్ణ ప్రసాద్ ను గ్రామస్తులు ప్రయాణికులు కోరారు.

# బాల్య వివాహాలు ఈ టీజింగ్ పై అవగాహనా సదస్సు




**నారాయణపేట, మే 15 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాలనీలో ప్రజలకు బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, పొక్సో యాక్ట్, సైబర్ క్రైమ్స్, గృహ హింస, షీ టీమ్స్, భరోసా సెంటర్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలపై చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలనే ఉద్దేశంతోనే ఈ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యుక్త వయసులో ఉన్న తమ పిల్లల దైనందిన కార్యకలాపాలను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలని, బాల్యవివాహలకు ప్రోత్సహించే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకొన బడతాయని తెలిపారు. అమ్మాయిలకు బాల్య వివాహాలు చేయరాదని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా అందరు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే 1930 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. నారాయణపేట జిల్లా పరిధిలో మహిళల, విద్యార్థుల రక్షణ మరియు భద్రత కొరకు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని ఏలాంటి ఆపద సమయం లోనైనా షీ టీమ్ నంబర్ 8712670398 కి పిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. పిల్లలు బాగా చదువుకొనేలా వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా జాగ్రత్తలు పాటించాలని కోరారు. పోలీసు శాఖ తరపునే కాకుండా ఇతర శాఖల ఆధ్వర్యంలో ఇకపై నిత్యం ఇలాంటి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఆపదలో ఉన్నవారు టోల్ ఫ్రీ నంబర్స్ 1930,108,100,112 లకు ఫోన్ చేసి పోలీసు ఇతర శాఖల సేవలు పొందాలని కోరారు. ప్రతి ఒక్కరూ కూడా మహిళలపై, చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించేందుకు బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు బాలరాజు, సమీనా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరంలో పండ్లు గుడ్లు పంపిణీ

### మార్నింగ్ వాకర్స్ సభ్యులు ఐటిపాముల రవీంద్ర



**వలిగొండ, మే 15 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు వేసవి కాలం క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరానికి మండల కేంద్రానికి చెందిన హైస్కూల్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 20 రోజుల నుండి విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిరోజు పండ్లు గుడ్లు అందజేస్తున్నారు. బుధవారం వలిగొండ గ్రామానికి చెందిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు దాత ఐటిపాముల రవీంద్ర విద్యార్థిని విద్యార్థులకు మూడు రోజులకు సరిపడ నున్న పండ్లు గుడ్లు అందజేశారు. ఆయనని మార్నింగ్ వాకర్స్ అభినందించారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్ అధ్యక్షులు బచ్చు శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవికాలం శిక్షణ శిబిరం ముగిసే వరకు పండ్లు గుడ్లు అందజేస్తామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ మార్నింగ్ వాకర్స్ ప్రధాన కార్యదర్శులు పోలేపాక బిక్షపతి, నాగెల్లి వలి, ఉపాధ్యక్షులు మైసొల్ల శ్రీకాంత్, బుంగమట్ల శ్రీనివాస్, తవటం రమేష్, బాలగోని మధు, గాడిపల్లి అశోక్, బాలరాజు, నరేష్, పోలేపాక రాజేష్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వ్యాయామ ఉపాధ్యాయులు పోలేపాక సాయి రజిత తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్ భార్య బాకారం శంకరమ్మ అనారోగ్యం పాలయ్యారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత రెడ్డి బుధవారం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాకారం శంకరమ్మను పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి సూచించారు. బాకారం శంకరమ్మకు, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

*–ఉప్పల్, మే 15 (నిఘా న్యూస్):*

## మలక్ పేటలో పెరిగిన ఓటింగ్ శాతం



**మలక్ పేట్, మే 15 (నిఘా న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా పోలింగ్ మే 13 న ప్రశాంతంగా ముగిసింది. మలక్ పేట్ లో ఈసారి పోలింగ్ శాతం పెరిగింది అని అధికారులు తెలిపారు. 2019 లోక్సభ ఎన్నికల్లో 37. 40 శాతం మంది ఓటేశారు. ఈసారి పోలింగ్ 45. 84 శాతం నమోదైంది. అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 3,54, 636 ఓటర్లు ఉండగా వీరిలో 1,81,336 మంది ఓటేశారు. కాగా, జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరగనున్నది.

## పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



**అరకు వ్యాలీ, మే 15 (నిఘా న్యూస్):** పశువులకు వాపు జబ్బులు రాకుండా ఉండడానికి ముందస్తుగా టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పశు వైద్యాధికారిణి రాజశ్రీ తెలిపారు. అల్లూరు జిల్లా డుంబ్రిగూడ మండలంలోని కురిడి, నారింజ వలస జంగిడి వలస అరకు గ్రామాలలో బుధవారం పశువులకు జబ్బు వాపు వ్యాధుల రాకుండా ఉండేందుకు కార్యక్రమం నిర్వహించామని ఆమె తెలిపారు. పశువులకు ఎటువంటి జబ్బులు రాకుండా ముందుగానే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## దోస్త్ ను సద్వినియోగం చేసుకోండి

### కళాశాల ప్రిన్సిపల్ ప్రో.విజయలక్ష్మి



**గంభీరావుపేట, మే 15 (నిఘా న్యూస్):** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఇంటర్ పాసైన విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. కళాశాలకు న్యాక్ గుర్తింపు, ఎన్ఎస్ఎస్ ద్వారా సామాజిక కార్యక్రమాల నిర్వహణ, కమ్యూనికేషన్ స్కిల్స్, అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్, విశాలమైన లైబ్రరీ ప్రొజెక్టర్ ద్వారా విద్యాబోధన, టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ, ఐఐటీ బాంబే ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సులు, గ్రీన్ ఆడిట్ ఐఎస్ఓ గుర్తింపు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఉపాధి అవకాశాల కల్పన కోసం బ్యూటిషన్ వంటి సర్టిఫికెట్ కోర్సులు, బాలికలకు హాస్టల్ వసతి సౌకర్యం, దోస్త్ అడ్మిషన్ల కోసం కవిత సెల్. 9492556586, కృష్ణప్రసాద్ సెల్. 9704118818 పూర్తి వివరాలకు సంప్రదించాలని ఆమె తెలిపారు.

## డబల్ ఇండ్ల కాలనిలో పేరుకు పోయిన చెత్త

### దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీ



**గంభీరావుపేట, మే 15 (నిఘా న్యూస్):** గంభీరావుపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీ డబల్ ఇండ్ల సముదాయంలో చెత్త ఎక్కడికక్కడే పేరుకు పోయింది. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, మలేరియా డెంగు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు గాని నాయకులు గాని ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. దోమల వలన వ్యాధుల బారిన పడటంతో పాటు ఆర్థిక ఇబ్బందులు సైతం పడుతున్నట్లు కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ప్రజా ప్రతినిధులకు నాయకులకు చెప్పిన గాని ఫలితం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు నాయకులు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను పరిష్కరించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పేరుకు పోయిన చెత్తను తొలగించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని కాలనీవాసులు కోరారు.

# పాలేరులో.. ప్రతి ఒక్కరిని పలకరించనున్న పొంగిలేటి

- నాలుగురోజుల పాటు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన
- ఒక్కో రోజు ఒక్కో మండలంలో
- 17న ఖమ్మం రూరల్, 18న నేలకొండపల్లి
- 19న తిరుమలాయపాలెం, 20న కూసుమంచి
- మండలంలోని ప్రతి గ్రామంలో 20నిమిషాల పాటు సమావేశం
- ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ప్రయత్నం




**ఖమ్మం, మే 15 (నిఘా న్యూస్):** మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సరికొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. క్యాంపు కార్యాలయానికి బాధితులను రప్పించుకునే అవసరం లేకుండా పాలేరు నియోజకవర్గ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకునేందుకు ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారు. తొలి విడతలో ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు వరుసగా నాలుగు రోజుల పాటు పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎంపిక చేసిన పలు గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. 17న ఖమ్మం రూరల్, 18న నేలకొండపల్లి, 19న తిరుమలాయపాలెం, 20న కూసుమంచి మండలాల్లో ఆయన పర్యటన సాగనుంది. ప్రజల వద్దకే పాలన అనే రీతిలోనే..! కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజల వద్దకే పాలన అందిస్తామని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ బాధితులు తిరగాల్సిన అవసరం లేదని చెబుతూ వస్తోంది. ఇదే తరహాలో మంత్రి పొంగులేటి సైతం తనను ఎమ్మెల్యేగా గెలిపించి శాసనసభకు పంపించిన పాలేరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లేలా నిర్ణయం తీసుకున్నారు. నేరుగా కలిసి వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలుసుకుని వీలైతే అక్కడికక్కడే పరిష్కారం చూపేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఒక్కో గ్రామంలో ఇరవై నిమిషాలు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాలు ఉండగా ఒక్కో మండలంలో ముప్పైకి పైగా గ్రామాలున్నాయి. కాగా వాటిలో తొలి విడతలో ప్రతి మండలంలో 15 నుంచి 18 గ్రామాల్లో పర్యటించనున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం సైతం స్థానిక ప్రజలతో కలిసి చేసేలా కసరత్తు జరుగుతోంది. ఒక్కో గ్రామంలో ఇరవై నిమిషాల పాటు సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఆ సమావేశంలోనే బాధితుల నుంచి వినతులను స్వీకరించి, సత్వర పరిష్కారం చూపే ప్రయత్నం చేయనున్నారు.

# రేపు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



**హైదరాబాద్, మే 15 (నిఘా న్యూస్):** శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆరాధన ఉత్సవాలకు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కమిటీ అధ్యక్షులు బలవంత చారి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలజ్ఞానీ, భూత భవిష్యత్ వర్తమాన కాలాలలో జరిగే వింతలు విశేషాలు ముందే, చెప్పిన మన పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారు జీవ సమాధి అయి 331 వ సంవత్సరాలు, లోక కళ్యాణం కోసం సమస్త జీవకోటి మనుగడకు, వారి ఆరాధన మహోత్సవాలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వారి ఆలయాల్లో అంగరంగ వైభవంగా స్వామి వారి భక్తులు నిరాజనాలు సమర్పించి, స్వామి వారి కృపపాత్రులు కావాలని కోరుచున్నాము. అలాగే తెలంగాణ విశ్వబ్రాహ్మణ ఆత్మ గౌరవ భవన ట్రస్ట్ సౌజన్యంతో ఉప్పల్ భగాయత్ లో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కమిటీ 17వ తేదీన ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నాము. కావున రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు, విశ్వబ్రాహ్మణ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కమిటీ అధ్యక్షులు బలవంత చారి విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్ గంజాయి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

### డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



**బాలాపూర్, మే 15 (నిఘా న్యూస్):** సమాజంలో డ్రగ్స్ నిర్మూలన భాద్యతలు పోలీసులు, ఎక్సైజ్ శాఖలే కాక స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తీసుకోవాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రామ్ శేఖర్ అన్నారు. బుదవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఎంతో భవిష్యత్ ఉన్న ఇద్దరు యువకులు గంజాయి బారిన పడి చావు బ్రతుకుల మధ్య ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం కంటే గంజాయి అత్యంత ప్రమాదకరమైనదని, మద్యంతో ఆవ్యక్తికే ప్రమాదమని గంజాయి, డ్రగ్స్ వల్ల సమాజ ఉనికికే ప్రమాదమని అన్నారు. బడి, గుడి లేని గ్రామం ఉండవచ్చు కానీ గంజాయి కి అలవాటు పడ్డ యువకులు లేని గ్రామం లేదంటే అతిశయోక్తి లేదని, ఈ ప్రమాదం నుండి తప్పించుకొని సమాజం నుండి ఈ చెడును పారద్రోలలంటే కార్పొరేషన్ లోని ప్రతి ప్రజాప్రతినిధి, నాయకులు పోలీసుల సమన్వయంతో గంజాయి సేవనానికి బానిసలైన యువకులను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి, గంజాయి పెడ్లర్స్ ఉన్నారో వారినీ కూడా గుర్తించి కఠినమైన శిక్షలు వేయాలని సూచించారు. గంజాయికి బడుగు బలహీనవర్గాలకు చెందిన యువకులే బానిసలై తమ ఆరోగ్యాలతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఆస్తులు కూడా అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి మహమ్మారి తో తీవ్రమైన ప్రాణ నష్టం, తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతుందని, ఇటీవల గంజాయికి బానిసైన కొడుకు భాద భరించలేక కన్న కొడుకునే చంపిన ఘటనను గుర్తుచేశారు. గతంలో కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి గంజాయి, డ్రగ్స్ లను అరికట్టాలని కఠినమైన ఆదేశాలిచ్చినా డ్రగ్స్ ఇంకా ఊరూరా సరఫరా అవుతుందని, కార్పొరేషన్ పరిధిలో నాలుగు పోలీస్ స్టేషన్లు ఉన్నా, ఎక్సైజ్, పోలీస్ శాఖలు గంజాయి నిర్మూలనలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో తమ భాద్యతగా ప్రతిఒక్కరూ పనిచేయాలని అన్నారు.

# తీన్మార్ మల్లన్నను గెలిపించండి



**కారేపల్లి, మే 15 (నిఘా న్యూస్):** ఖమ్మం వరంగల్ నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మే 27వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆదేర్ల నాగరాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ గెలుపులో భాగమైన వ్యక్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు ఎమ్మెల్సీ ఓటర్లు మద్దతు ఇస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయిన తీన్మార్ మల్లన్న ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తీన్మార్ మల్లన్నకు అవకాశం ఇస్తే సమస్యలు తీరుతాయని అన్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలు



### మొక్కులు చెల్లించుకున్న గౌడ సంఘం కులస్తులు

**ధర్మపురి, మే 15 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలంలోని కమ్మర్ ఖాన్ పేట గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలు నిర్వహిస్తున్నారు. గౌడ సంఘం అధ్యక్షులు తాళ్ల పెల్లి బాలయ్య గౌడ్,ఉపాధ్యక్షులు నేరెళ్ల మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సకల సౌకర్యాల ఏర్పాట్లు చేశారు.ఆదివారం పోచమ్మ బోనాలతో ప్రారంభమైన రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలు,నేటితో ముగుస్తున్నాయి. బుధవారం గౌడ సంఘం కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లికి మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని వచ్చి ఆ తల్లికి సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి,రేణుక ఎల్లమ్మ తల్లి అందరిని చల్లగా చూడు తల్లి అని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు తాళ్ల పెల్లి బాలయ్య గౌడ్, ఉపాధ్యక్షులు నేరెళ్ల మహేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు,కులస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## రాజిరెడ్డి కుటుంబాన్ని ఓదార్చిన శ్రీరాములు



**దేవరుప్పుల, మార్చి 15 (నిఘా న్యూస్):** దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన గోలి కృష్ణారెడ్డి తండ్రి రాజిరెడ్డి(75)ఉదయం తెల్లవారు జామున మరణించగా వారి ఇంటికి వెళ్ళి రాజిరెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ దేవరుప్పుల గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య, సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి,ఆకుల సోమ నర్సయ్య, బోనగిరి యాకస్వామి,పులిగిళ్ల వెంకన్న, కిసాన్ సెల్ అధ్యక్షుడు బబ్బురి బాలరాజు,నీలారపు వెంకన్న,తోటకూరి పాండు కృష్ణ,ఉప్పుల యాదగిరి,చలమారెడ్డి, తోటకూరి యాదయ్య, సోమనర్సయ్య, చింతల రవీందర్ రెడ్డి,జక్కుల గంగరాజు తోటకూరి వెంకన్న, తీగల కొండయ్య నీలారపు మహేష్, బెతి శ్రీకాంత్, లోడంగి అశోక్,రమేష్ నాతి పూర్ణ చందర్,సంతోష్,అనిల్,వినోద్, బుచ్చి రాములు తదితరులున్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి..

### బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ధర్మపురి, మే 15 (నిఘా న్యూస్):** ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీ లక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ను బుధవారం ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆవిష్కరించారు.ఖిలావనపర్తి గ్రామ ప్రజలు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అడ్లూరికి అందించారు.ఈనెల 17వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరుగు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణం, రథోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలని బ్రాహ్మణ సంఘం వారు ఆహ్వానించారు. పోస్టర్ ఆవిష్కరణలో ధర్మారం మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి,కాంగ్రెస్ నాయకులు జగన్ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు వసతి గృహానికి విరాళం



**బాసర, మే 15 (నిఘా న్యూస్):** బాసర మండల కేంద్రంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమీపంలో చేపడుతున్న మున్నూరు కాపు వసతిగృహం, నిత్యాన్నదాన సత్రం కొరకు విరాళాలు సేకరిస్తున్నారు. బుధవారం కుబీర్ మండలం పల్సి గ్రామ మున్నూరు కాపు సంఘం తరపున లక్ష రూపాయలు విరాళంగా ముధోల్ నియోజకవర్గ అధ్యక్షులు రాళ్ళ రమేష్ కు అందజేశారు. ఇందులో పల్సి సంఘం అధ్యక్షులు కొట్టే సత్యనారాయణ, నియోజకవర్గ మున్నూరు కాపు సంఘ సభ్యులు పిరాజి తదితరులు పాల్గొన్నారు. తక్కువ చూపించు

## ఆర్థిక వృద్ధి లక్ష్యంగా గ్రోయింగ్టన్ వెంచర్స్



**హైదరాబాద్, మే 15 (నిఘా న్యూస్):** సీఏ విక్రమ్ బజాజ్ ప్రమోట్ చేసిన ముంబైకి చెందిన బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీ గ్రోయింగ్టన్ వెంచర్స్ ఇండియా లిమిటెడ్ రాబోయే కాలంలో బలమైన వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లోనే గ్రోయింగ్టన్ వెంచర్స్ ఇండియా లిమిటెడ్ అద్భుతమైన ఆర్థిక గణాంకాలను నమోదు చేసిందన్నారు. కంపెనీ ఆదాయం 163 శాతం వృద్ధితో రూ.23.81 కోట్లకు చేరిందన్నారు. నికర లాభం 328 శాతం వృద్ధితో రూ.1.75 కోట్లకు చేరిందన్నారు.

## శంకర్ నాయక్ మాతృమూర్తికి నివాళులు



**వైరా, మే 15 (నిఘా న్యూస్):** వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన శంకర్ నాయక్ తల్లి బాదావత్ సౌకు ఇటీవల మృతి చెందారు. ఆమె దశదినకర్మ డోర్నకల్‌లోని లచ్చ తండా (గొల్లచర్ల) గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్య అనుచరుడు, కాంగ్రెస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకులు, బాధావత్ సైదులు నాయక్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. కొద్దిసేపు శంకర్ నాయక్ తో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, అధైర్య పడొద్దన్నారు. నివాళులర్పించిన వారిలో మేడా సూర్యప్రసాద్, మేడా సంపత్ కుమార్, భాస్కరరావు, ముదిగొండ్ల మహేష్ తదితరులు ఉన్నారు.

## రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించండి

### గాంధీ విగ్రహం వద్ద నిరసన



**కారేపల్లి, మే 15 (నిఘా న్యూస్):** కొత్తగూడెం నుండి వయా కారేపల్లి ద్వారా వివిధ ప్రాంతాలకు ప్రయాణించే రైళ్లను ఇటీవల కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. రద్దు చేసిన మా రైళ్ళను మాకు నడపాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మాకు నూతన రైళ్లను ఏర్పాటు చేయాలని కోరడం లేదని, గతంలో నడిచిన మా రైళ్లు మాకు నడపాలని ఆయన ప్ల కార్డుల ద్వారా నిరసన వ్యక్తం చేశారు.

## స్వయం సంఘాల మహిళలతో కలెక్టర్ సమీక్ష



**సిరిసిల్ల కలెక్టరేట్, మే 15 (నిఘా న్యూస్):** స్వయం సంఘాల గ్రూపులకు చెందిన మహిళలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. స్వయం సంఘాల గ్రూపులకు చెందిన మహిళలు యంత్రాలపై విస్తారాకులు, పేపర్ ప్లేట్స్, చట్నీలు, వక్కపొడి, లెదర్ బ్యాగ్స్, స్వీట్స్, సమోసాలు, పిండి వంటలు, మగ్గం వర్క్స్ ఇతర సామాగ్రి తయారు చేసి, విక్రయిస్తున్నారు. వీరందరితో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా వస్తువులు తయారు చేసే వారితో మాట్లాడారు. వస్తువుల తయారీ, దానికి అయ్యే ఖర్చు, ఎంత మందికి ఉపాధి అవకాశాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, మెప్మా డీఎంసీ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ



**కారేపల్లి, మే 15 (నిఘా న్యూస్):** కారేపల్లి మండల పరిధిలోని గాంధీనగరం గ్రామానికి చెందిన ఎజ్జ సునీత కుటుంబానికి నాలుగు నెలల పాటు సరిపడా నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఆకలి అందరిదీ అనే స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ఈ సరుకులు పంపిణీ చేశారు. పది నెలల క్రితం సునీత ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయింది. విషయం తెలుసుకున్న ఫక్రుద్దీన్ తన సంస్థ ద్వారా నిత్యవసర వస్తువులను స్వయంగా వెళ్లి కుటుంబ సభ్యులకి అందజేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజారిటీ ఖాయం



**కారేపల్లి, మే 15 (నిఘా న్యూస్):** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి భారీమెజార్టీతో విజయం సాధిస్తారని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ 12 ఎంపీ స్థానాల్లో గెలుస్తుందని, కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారమని పేర్కొన్నారు. బుధవారం వైరాలోని మండల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడారు.

## పోలీసుల ఆధ్వర్యంలో క్రీడల పోటీలు



**ముస్తాబాద్, మే 15 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ వారు కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంటు ముస్తాబాద్ మండలంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు. మండల స్థాయి టోర్నమెంట్ లో ప్రతి గ్రామం నుంచి ఒక కబడ్డీ, ఒక వాలీబాల్ టీం కి అవకాశం ఇస్తున్నామని ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేటి సాయంత్రం నాలుగు గంటల లోపు తమ టీం వివరాలు పోలీస్ స్టేషన్లో ఇవ్వవలసిందిగా కోరుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.వివరాల కోసం Pc.శ్రీనివాస్ 98666 49293, పీసీ రాజశేఖర్ 96661 55150 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు చెప్పొచ్చు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెండు జట్లను జిల్లా స్థాయిలో ఆడించడం జరుగుతుందని తెలియజేశారు.

# రైతులు వరి కోయ్యలను కాల్చుతున్న దృశ్యం..



- వరి కోయ్యలను కాల్చకండి
- వరి కోయ్యలకు నిప్పి పెడితే రైతులకు నష్టం
- భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గుతుంది
- పొలాన్ని కలయదున్నితేనే పంటలకు మేలు

**గంభీరావుపేట, మే 15 (నిఘా న్యూస్):** హార్వెస్టర్ మిషన్‌తో వరి పంటను కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు గడ్డిని తీసుకెళ్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలను తగల బెడుతున్నారు. కొయ్యలను కాల్చొద్దు వరి కొయ్యలకు నిప్పుపెడితే రైతులకు నష్టం భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గుతుంది. పొలాన్ని కలియ దున్నితేనే పంటలకు మేలు. గతంలో వరి పంటలను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. రైతులకు పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వెస్టర్ మిషన్‌తో వరి పంటను కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు గడ్డిని తీసుకెళ్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలను తగలబెడుతున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశముందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వరికొయ్యలను తగులబెట్టొద్దని రైతులకు వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు.

## కాల్చడం ద్వారా భూసారం కోల్పోతుంది

వరికొయ్యలను కాల్చితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమిసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. ముఖ్యంగా పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, రైతుమిత్ర పురుగులు నశిస్తాయి. దీంతో పంట దిగుబడి సరిగా రాదు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాల గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పర్యావరణానికి హాని కలుగుతుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి ప్రమాదమూ ఉంది. పొలాన్ని కలియ దున్నితే కలిగే లాభాలను గూర్చి వివరించారు. కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5నుంచి 10శాతం వరకు అధికంగా వచ్చే అవకాశముంది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. సూపర్ ఫాస్ఫేట్ చల్లితే భూమిని చౌడు బారడం నుంచి తప్పించడమే కాక భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుతుంది. ఇలా చేయడం వల్ల నీటి నిలువ చేసుకునే సామర్థ్యం పెరిగి కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను వరకు ఎరువు తయారవుతుంది మొక్కలకు 2శాతం నత్రజని(యూరియా) 4శాతం ఫాస్ఫరస్ అదనంగా అందిస్తుంది. నేలలో కరుగని మూలకాలనూ పంటకు అనుకూలంగా మార్చుతుంది.

## ఎనిమిది రోజులు ముందుగా దున్నాలి

చాలామంది రైతులు వరినాటు వేసే సమయంలో మొదటిసారి దున్నుడుకు, రెండోసారి దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదురోజుల సమయం మాత్రమే తీసుకుంటారు. దీనివల్ల వరికొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోవు. ఇలాంటి సమయంలో పశువులను అందులో వదిలితే అటు, ఇటు తిరగడం, పొలంలో పేడ, మూత్ర విసర్జన చేయడం ద్వారా త్వరగా కుళ్లిపోయి భూసారంతోపాటు పంట దిగుబడి ఐదు శాతం పెరుగుతుంది. లేదంటే అందులోనే కలియదున్ని కనీసం ఎనిమిది రోజుల సమయం తీసుకుని రెండోసారి దున్నాలి. వీలైతే మొదటిసారి రోటోవేటర్‌తో దున్నితే గడ్డి, కొయ్యకాలు చిన్న, చిన్న ముక్కలుగా విడిపోయి మరోసారి దున్నినప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. దున్నే ముందు ఎకరానికి క్వింటాలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోతాయి. జీలుగ,పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

## అవగాహన కల్పించని అధికారులు

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దని అధికారులు, రైతులకు సూచనలు, సలహాలు అందించడం లేదు. రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు అందించడం లేదు. కనీసం క్రాప్ బుకింగ్‌లోనైనా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సాగు వివరాలు సేకరించాల్సి ఉంటుంది. కానీ రైతు వేదికలలో ఉంటూ రైతులను పిలిపించుకొని పంటలు నమోదు చేస్తున్నారని రైతులే చెబుతున్నారు. ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సూచనలు అందించాల్సిన అవసరమున్నది.

## అవగాహన లోపంతోనే కాలుస్తున్నారు.



రైతులకు అధికారులు అవగాహన కల్పించకపోవడం వల్లనే వరి పంట అనంతరం వరి కోయ్యలను కాల్చి వేస్తున్నారు. వరి కోయలు కాలిస్తే వచ్చే అనర్థాలను అధికారులు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

*ఆర్ ఆంజనేయులు రైతు, నర్మాల*

## కొయ్యలను కాల్చితే దిగుబడి తగ్గుతుంది



వరి కోయ్యలను కాల్చితే గాలి నేల కలుషితమవుతుంది.పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. దీంతో పంట దిగుబడి తగ్గుతుంది. వరి కోయలను పొలంలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడంతో దిగుబడి పెరుగుతుంది.

*వెంకటేష్ మండల వ్యవసాయ అధికారి, గంభీరావుపేట*

# మల్కాజిగిరిలో..

## బిజెపి అత్యధిక మెజార్టీ సాధిస్తుంది బిజెపి నాయకులు ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్




**మేడ్చల్, మే 15 (నిఘా న్యూస్):** ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో మల్కాజిగిరి బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ దక్షిణ భారతదేశంలోనే బిజెపి పార్టీలో అత్యధిక మెజారిటీ సాధిస్తారని బిజెపి కార్యకర్త ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సాధనలో, తెలంగాణ అభివృద్ధిలో ఎనలేని కృషిచేసిన ఈటల రాజేందర్ అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల ప్రజలకు సుపరిచితులు. ఈటల రాజేందర్ ప్రజలందరికీ అందుబాటులో ఉండి పేద, బడుగుబలహీన వర్గాల ప్రజలకు సహాయం చేసే వ్యక్తి అని ఇలాంటి నాయకులను ప్రజలు ఎన్నుకుంటే ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెంది సుభిక్షంగా తయారవుతుందని ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఈటల రాజేందర్ గారి కోసం గత 70 రోజులుగా విశేషకృషి చేసిన బిజెపి కేంద్ర, రాష్ట్ర అధిష్ఠానంకు, మల్కాజిగిరి పార్లమెంట్, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, మద్దత్తుదారులకు, అన్ని గేటెడ్ కమ్యూనిటీల ప్రజలకు, మేడ్చల్ మెట్రో రైల్ సాధన సమితి గ్రూపు సభ్యులకు ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# కెనడా అడవుల్లో భారీ అగ్నిప్రమాదం

## తగలబడుతున్న వేలాది ఎకరాల అడవి ప్రమాదంలో చమురు నిల్వలు

**కెనడా, మే 15 (నిఘా న్యూస్):** కెనడా అడవుల్లో అకస్మాత్తుగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దాదాపు 25 వేల ఎకరాల్లో అడవి తగలబడిపోతుంది. పాలనా యంత్రాంగం మంటలను అదుపు చేయలేకపోయారు. సమీప ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే మంటలు కదులుతున్న దిశలో చమురు రిజర్వాయర్ ఉంది. కెనడాలో ఈ అగ్నిప్రమాదం ఇప్పుడు ఫోర్ట్ మెక్‌ముర్రే వైపు కదులుతోంది. మంటలు నివాస ప్రాంతాలు, చమురు నిక్షేపాల వైపు వేగంగా కదులుతున్నాయని మంగళవారం పరిపాలన తెలిపింది. వేడిగాలులు, పొడి వాతావరణమే అగ్నిప్రమాదానికి కారణమని చెబుతున్నారు. దట్టమైన అడవుల నుంచి చెలరేగిన మంటలు ఇప్పుడు పశ్చిమ కెనడాలోని ఆయిల్ టౌన్ ఫోర్ట్ మెక్‌ముర్రేకు చేరుతున్నాయి. ప్రమాదాన్ని దష్టిలో ఉంచుకుని, ఇక్కడ నాలుగు ప్రాంతాలకు చెందిన సుమారు 6000 మంది ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశించారు. చమురు నిక్షేపాల సమీపంలో మంటలు చెలరేగడంతో బుధవారం చమురు ధరలు పెరిగాయి. అగ్నిప్రమాదం తర్వాత, చమురు ధరలు బుధవారం పెరగడం ప్రారంభించాయి. ఇక్కడ రోజుకు 10 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి అవుతుంది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 34 సెంట్లు పెరిగి 82.71 డాలర్లకు చేరుకుంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ఫ్యూచర్ బ్యారెల్‌కు 38 సెంట్లు పెరిగి 78.39డాలర్లకి చేరుకుంది. శివారు ప్రాంతాలైన అబాసాండ్, హిల్, బీకాన్, ప్రైరీ క్రీక్, గ్రేలింగ్ ప్రాంతాలకు కూడా మంటలు వ్యాపించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. వేడి గాలి వేగం తగ్గకపోవడంతో మంటలు ఆ ప్రాంతమంతా గంటకు 40 కి.మీ వేగంతో వ్యాపిస్తున్నాయి. ఇక్కడి ప్రజలు వీలైనంత త్వరగా ఇళ్లు ఖాళీ చేయాలని అధికార యంత్రాంగం ఆదేశించింది. 2016లో కూడా కెనడాలోని ఫోర్ట్ మెక్‌ముర్రే అడవిలో ఇలాంటి ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో దాదాపు 90 వేల మందిని సురక్షితంగా తరలించడంతో చమురు ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చింది. 2016 అగ్నిప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఎల్సీ నిస్టర్ మాట్లాడుతూ, పరిపాలన తరలింపు ఆదేశాలు ఇవ్వని చోట కూడా ప్రజలు ఫోర్ట్ మెక్‌ముర్రేలోని ఇతర ప్రాంతాలను విడిచిపెట్టడం ప్రారంభించారు.

# పిల్లల్ని రెగ్యులర్ గా బడికి పంపించాలి

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య



**పెద్దపల్లి, మే 15 (నిఘా న్యూస్):** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య తన పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని గిరిజన చెంచు తెగకు చెందిన నిరుపేద కుటుంబాలకు పండ్లు పంపిణీ చేశారు. తన కుమారుడు ఈర్ల ఆదర్శ్ తో కలిసి ఆయన 50 మందికి 12 డజన్ల అరటి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్ని బాగా చదివించాలని, వారి భవిష్యత్తు గురించి ఆలోచించాలని ఆయన కోరారు. అడవుల్లో, చేను, చేలుకల్లో కాపలాదారులుగా ఉంటూ పిల్లల్ని తమ వెంట తీసుకెళ్తున్నారని, దాంతో పిల్లల చదువు వెనుకపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే ఉంటూ పిల్లల్ని రెగ్యులర్ గా బడికి పంపించాలని వారిని బాగా చదివించాలని ఆయన కోరారు. డిగ్రీ వరకు చదువుకుంటే ఎస్టీ కేటగిరీ కింద తప్పకుండా ఉద్యోగం, ఉపాధి దొరుకుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని బడి మాన్పించకుండా బాగా చదివించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆడ పిల్లలకు బాల్య వివాహాలు చేయకూడదని, బాల్య వివాహాల వల్ల వారి ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ నూతన జీవన విధానాన్ని అలవర్చుకొని, మెరుగైన జీవనం సాగించాలని ఈర్ల సమ్మయ్య సూచించారు.

# విశాఖలోనే జగన్ ప్రమాణస్వీకరం ఖాయం

## మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

**విశాఖపట్టణం, మే 15 (నిఘా న్యూస్):** ఎన్నికల్లో వైకాపా విజయం ఖాయమయ్యిందని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని, త్వరలోనే డేట్ ఫిక్స్ చేస్తామని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు తెలిసింది మోసం, దగా, కుట్రలు అని, మరోవైపు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ చెప్పింది చేస్తారని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ఎన్ని హామీలు ఇచ్చినా ఏపీ ప్రజలు వారిని నమ్మలేదని, అందుకే ఫ్యాన్ గుర్తుకు ఓటేశారని చెప్పారు. మే 13న జరిగిన ఏపీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి బలంగా వీచిందన్నారు. ఏపీ ఎన్నికలపై మంత్రి బొత్స మంగళవారం నాడు విరీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో సీఎం జగన్ ను మరోసారి ఆశీర్వదించిన ప్రజలకు ధన్యవాదాలు. టీడీపీ కార్యకర్తలు ఓటమి తెలిసి, సహనం కోల్పోయి దాడులకు పాల్పడుతున్నారు. ఓడిపోతున్నారనే టీడీపీ నేతలు పల్నాడులో దాడులకు పాల్పడ్డారు.. మేం కనుక ఒక్క పిలుపు ఇచ్చి ఉంటే అంతా క్లోజ్. సచివాలయ వ్యవస్థను అవినీతి రూపు మాపడానికి పెట్టాం. కార్యకర్తలు ఎప్పుడూ నేతల పక్కనే ఉంటారు. మహాత్మా గాంధీ కలలు కన్న వ్యవస్థే సచివాలయ వ్యవస్థ. వాలంటరీ వ్యవస్థ కరోనా సమయంలో ఎన్నో సేవలు అందించింది. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సేవలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అందించారు వాలంటీర్లు. ఎన్నికల సమయంలో టీడీపీ సహనం కోల్పోయినా, మనం సంయనంగా వ్యవహరించాలని వైసీపీ కార్యకర్తలకు సూచించాం. జగన్ ను అధికారంలోకి తీసుకురావాలి. మహిళలు, యువత, పేద వర్గాలకు మరో ఐదేళ్లు సంక్షేమాన్ని కొనసాగిస్తాం. కవ్వింపులు జరిగినా మా కార్యకర్తలు సహనంగా ఉన్నందుకు ఏపీలో భారీగా పోలింగ్ నమోదైంది. తులసివనంలో గంజాయి మొక్కలా కొందరు జర్నలిస్టులు ఉంటారు. ప్రజాధరణ ఎక్కువగా ఉన్న కారణంగానే నన్ను టీడీపీ కూటమి నేతలు నన్ను టార్గెట్ చేశారు. అది మా బలంగా భావిస్తాం. కానీ అది టీడీపీ శ్రేణుల బలహీనత. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు నారా లోకేష్ నామినేటెడ్ పదవి తీసుకున్నాడు. కానీ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా నెగ్గలేదు. చంద్రబాబు వదిన పురంధేశ్వరి మరో పార్టీలో అధ్యక్షురాలిగా ఉన్నారు. నందమూరి బాలకృష్ణ, ఆయన అల్లుళు లోకేష్, భరత్ లు రాజకీయాల్లో ఉన్నారు. కుటుంబ పాలన ఎవరిదో ఇప్పుడు చెప్పండి. ఈవీఎంలు ఎక్కడ భద్రపరచాలి అనేది ఎలక్షన్ కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. కానీ వ్యవస్థ విరీద అవగాహన లేక ఈవీఎంలపై కామెంట్లు చేస్తున్నారని' మండిపడ్డారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్స్ పెట్టవద్దని మంత్రి బొత్స సూచించారు. తాము గెలిచేస్తున్నామని టీడీపీ నేతలు ప్రచారం చేస్తే, అది నిజమని బెట్టింగ్ కాస్తే లక్షలు పోగొట్టుకుని, జీవితాలు కోల్పోతారని హెచ్చరించారు. జూన్ 4 వరకు ఆగితే ఫలితాలు ఎవరివైపు తేలుతుందని, వైసీపీ మరోసారి భారీగా సీట్లు సాధించి ఏపీలో అధికారంలోకి వస్తుందన్నారు. కేంద్రంలో ఎవరు వచ్చినా, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమని మంత్రి బొత్స స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలు తప్ప, రాజకీయ ప్రయోజనాలు తమకు ముఖ్యం కాదన్నారు.

# పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదం

## ఆరుగురు సజీవ దహనం

**పల్నాడు, మే 15 (నిఘా న్యూస్):** పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రిలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో మంటలు చెలరేగి ఆరుగురు సజీవదహనమయ్యారు.ఒకే కుటుంబానికి ముగ్గురు మంటల్లో కాలి బూడిదయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసి హైదరాబాద్ తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుతుండగానే ఆరుగురి బతుకులు తెల్లారిపోయాయి. పల్నాడు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో బస్సులో మంటలు చెలరేగి ఆరుగురు సజీవదహనమయ్యారు. చిన్నగంజాం నుంచి చీరాల మీదుగా హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో డ్రైవర్ సహా బస్సులోని నలుగురు ప్రయాణికులు కాలిబూడిదయ్యారు. టిప్పర్ డ్రైవర్ కూడా సజీవ దహనమయ్యారు. మిగిలిన ప్రయాణికులు త్రుటిలో ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. సార్వత్రిక ఎన్నికల కోసం హైదరాబాద్ నుంచి చీరాల సమీపంలోని వివిధ గ్రామాలకు పెద్దఎత్తున ప్రజలు ఓట్లు వేసేందుకు బయలుదేరి వెళ్లారు. ఓట్లు వేసి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపి మళ్లీ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బుక్‌చేసుకున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు ఎక్కించుకుని బస్సు చీరాల మీదుగా హైదరాబాద్ వస్తుండగా...మార్గమధ్యలో పల్నాడు జిల్లా పసుమర్రు సమీపంలోని ఉరిపాలెం వద్ద ట్రావెల్స్ బస్సును టిప్పర్‌లారీ బలంగా ఢీకొట్టింది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో తొలుత టిప్పర్‌లారీలో మంటలు చెలరేగి అవి బస్సుకు వ్యాపించాయి. క్షణాల్లోనే బస్సు మొత్తం మంటలు వ్యాపించడంతో అందులో చిక్కుకున్న ఐదుగురు సజీవ దహనమయ్యారు. 20 మందికి పైగా ప్రయాణికులు గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ప్రయాణికులంతా చిన్నగంజాం, గోనసపూడి, నీలాయపాలెం గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు. బస్సు ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులతోపాటు బస్సు డ్రైవర్, టిప్పర్ డ్రైవర్ మంటల్లో సజీవదహనమయ్యారు. వీరిలో నీలాయపాలెంకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు(62), భార్య లక్ష్మీ( 58), మనవరాలు పిట్టు( 09) చనిపోయారు. డ్రైవర్ అంజి( 35). స్వల్పగాయాలతో బయటపడిన వారిని చిలకలూరిపేట, గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న వారిని పర్చూరు తెలుగుదేశం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరామర్శించారు. అర్ధరాత్రి ఒకటిన్నర గంటల ప్రాంతంలో ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉండగా ప్రమాదం జరిగింది. పిడుగురాళ్ల-వాడరేవు బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో కంకర లోడ తో వస్తున్న టిప్పర్ లారీ ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది.

# ఎపిలో ఎన్‌డిఎ కూటమిదే అధికారం

## కార్యకర్తల కృషి మరువలేనిది: పురంధేశ్వరి

**విజయవాడ, మే 15 (నిఘా న్యూస్):** ఎపిలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రాబోతోందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. అందరి సమిష్టి కృషితో ఇటు ఏపీలో అటు దేశంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడం ఖాయమని దగ్గుబాటి పురంధేశ్వరి ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలే పార్టీకి ప్రధాన బలమని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సవిరీక్షా సమావేశంలో భాగంగా ఈ మేరకు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తల ఆధారిత పార్టీ అని పురంధేశ్వరి ఈ సందర్భంగా అన్నారు. పార్టీ అభివృద్ధి చెందడంలో కార్యకర్తల పాత్ర ఎంతో ఉందని, ఈ నేపథ్యంలో వారి సేవలను ప్రశంసిస్తున్నట్లు చెప్పారు. అంతేకాదు ప్రధానంగా ఇటీవల ఎన్నికల సమయంలో కార్యకర్తలు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని పురంధేశ్వరి అన్నారు. పార్టీ ప్రచారంతో మొదలుకుని ప్రతి విభాగంలో కూడా కార్యకర్తలు ఎంతో సేవ చేశారని, వీరు లేకుండా పార్టీ లేనే లేదని అన్నారు. మరోవైపు ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి 81.6 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో ప్రజలు ఏ పార్టీకి పట్టం కట్టారోనని రాజకీయ వర్గాలు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల కానున్నాయి.

# కోవిడ్ వ్యాక్సిన్ తర్వాత... శరీరం పనిచేయడం లేదు

## కోవిడ్ వ్యాక్సిన్ పై మహిళ ఫిర్యాదు, కేసు నమోదు

**న్యూఢిల్లీ, మే 15 (నిఘా న్యూస్):** ఆస్ట్రాజెనాకా వ్యాక్సిన్‌పై మరో మహిళ దావా వేసింది. క్లినికల్ ట్రయల్స్ సమయంలో ఇచ్చిన వ్యాక్సిన్ తనను పూర్తిగా వికలాంగురాలిగా మార్చిందని మహిళ చెప్పింది. ఇప్పుడు ఆమె శరీరం మునపటిలా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. సంస్థ వైద్యం అందించడం లేదని ఆరోపించింది. విశేషమేమిటంటే బ్రిటన్‌లో ఇప్పటికే 50 మందికి పైగా ఆస్ట్రాజెనెకాపై దావా వేశారు. 42 ఏళ్ల బ్రే డ్రస్సెన్ అమెరికాలో ఆస్ట్రాజెనెకా కోవిడ్ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్‌లో పాల్గొన్నారు. 2020 లో విచారణలో పాల్గొన్న తర్వాత.. అతను తీవ్రమైన నరాల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ బ్రిటిష్ వ్యాక్సిన్‌ను అమెరికాలో పరీక్షించారు. కానీ ఉపయోగం కోసం ఆమోదించబడలేదు. పరిశోధన ఫలితంగా తగిలిన గాయాల చికిత్సకు కంపెనీ చెల్లిస్తుందని వాగ్దానం చేసిన కంపెనీతో తాను ఒప్పందం కుదుర్చుకున్నానని డ్రస్సెన్ పేర్కొన్నారు.నవంబర్ 2020 లో వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత.. ఆమె తన శరీరమంతా ముడతలు పడటం ప్రారంభించిందని మహిళ చెప్పింది. దీని తరువాత కూడా అస్ట్రాజెనెకా తన చికిత్స కోసం చేసిన ఖర్చులను చెల్లించలేదు. పెరిఫెరల్ న్యూరోపతితో బాధపడుతున్న తర్వాత తాను పని చేయలేకపోతున్నానని ఆమె వార్తాపత్రికతో చెప్పింది. “నేను వ్యాక్సిన్ కారణంగా నా ఉద్యోగాన్ని కోల్పోయాను. ఇప్పటికీ వైకల్యంతో ఉన్నాను” అని డ్రెస్సెన్ చెప్పారు. ‘వారంలో ఏడు రోజులూ రోజుకు 24 గంటలూ తల నుంచి కాలి వరకు నా శరీరమంతా సూదులు గుచ్చినట్లు అనిపిస్తుంది’ అని ఆమె చెప్పింది. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత తాను చాలాసార్లు ఆసుపత్రిలో చేరానని, దాని వల్ల బిల్లు వేల డాలర్లకు చేరుకుందని ఆమె చెప్పింది. మానసిక క్షోభ, ఆదాయ నష్టం, రవాణా, న్యాయపరమైన రుసుములను క్లెయిమ్ చేస్తోంది. మహిళ వత్తిరీత్యా ఉపాధ్యాయురాలు, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.

# పోలింగ్ సరళిపై వైసిపి సమీక్ష

## వైసిపి విజయం సాధిస్తుందని కేకే రాజు ధీమా



**విశాఖపట్నం, మే 15 (నిఘా న్యూస్):** జరిగిన ఎన్నికలలో పోలింగ్ సరళిపై పార్టీ శ్రేణులతో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు బుధవారం పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ వారీగా గత ఎన్నికలు ఈ ఎన్నికలలో పోలైన ఓట్లు వాటిలో మనకు మెజారిటీగా వచ్చే ఓట్లు గురించి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని దీమ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

### పొంగులేటి వీరాభిమాని చామర్తి గోపి శాస్త్రి



**దమ్మపేట, మే 15 (నిఘా న్యూస్):** ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండల వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఎమ్మెల్సీ ఓట్లు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు చామర్తి గోపిశాస్త్రి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి, ఎప్పటికప్పుడు ప్రజల ముందు నుంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన తీన్మార్ మల్లన్న ను కాంగ్రెస్ పార్టీ గుర్తించి, ఖమ్మం, నల్గొండ, వరంగల్,కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించడం చాలా సంతోషకరమైన విషయం అని, తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు

### సూర్యదేవర కోటేశ్వరరావు



**మధిర, మే 15 (నిఘా న్యూస్):** మున్సిపాలిటీపరిధి ఇల్లందులపాడలో పారిశుధ్యంపై మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు స్థానిక నాయకులు సూర్యదేవర కోటేశ్వరావు. బుధవారం ఆయన గ్రామంలో పేరుకుపోయిన చెత్త కుప్పలను సోషల్ మీడియా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, వీధుల్లో చెత్తాచెదారం, డ్రైనేజీల్లో సిల్ట్ పేరుకుపోయినా, దోమలు వృద్ధి చెందుతున్నా పూర్తిస్థాయిలో చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీ కమిషనర్,ఉద్యోగులు నిర్లక్ష్యం వీడడం లేదు అని ఎన్నిసార్లు చెప్పినా పారిశుధ్య కార్మికులు రావడం లేదన్నారు. తక్షణమే గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

### అడవుల్లో మంటలు ఎందుకు చెలరేగుతున్నాయి

### నివారించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైతుంది

**న్యూఢిల్లీ, మే 15 (నిఘా న్యూస్):** అడవుల్లో మంటలు చెలరేగడం, వాటిని అదుపు చేసే విషయమై ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి బుధవారం సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమన్లు జారీ చేసింది. శుక్రవారం రోజు తమ ముందు హాజరై అడవుల్లో మంటలు ఎందుకు చెలరేగుతున్నాయి.?వాటినిరాష్ట్ర ప్రభుత్వం నివారించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైతుందోననే అంశాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. భారీస్థాయిలో చెలరేగుతున్న మంటలను అరికట్టేందుకు అవసరమైన నిధులు సమకూర్చకపోవడంపై అసంతప్తిని వ్యక్తం చేసింది. అదేవిధంగా అడవుల్లో మంటలు మండుతున్న వేళ ఎన్నికల విధుల్లో అటవీ అగ్నిమాపక సిబ్బందిని ఎందుకు నియమించారని ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయితే, ఉత్తరాఖండ్అడవులల్లోభారీగాకార్చిచ్చులుచోటు చేసుకుంటున్నాయని, ఇప్పటికే చాలా వరకు అటవీ మంటల్లో దగ్ధమైందని, వాటిని అరికట్టడంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలివ్వాలని పిటిషనర్లు కోరారు. దీనిపై గురువారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సీరియస్ అయ్యింది. ఉత్తరాఖండ్ అటవీ ప్రాంతంలో భారీ స్థాయిలో మంటలుచెలరేగుతున్నాఅవసరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు..? ఆ మంటలను ఆర్పివేసేందుకు అవసరమైన అగ్నిమాపక సిబ్బందిని ఎందుకు నియమించలేదని.. ఎందుకు అలసత్వం వహిస్తున్నారంటూ ? ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.అయితే, అగ్నిమాపక సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతుందని, మంటల(కార్చిచ్చులు)ను ఆర్పివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందడంలేదని ఆ రాష్ట్ర తరఫున న్యాయవాది న్యాయస్థానానికి విన్నవించారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మే 17న ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధర్మాసనం ముందు హాజరై, ఇందుకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## తెలంగాణలో చల్లబడిన వాతావరణం

### వచ్చే 3 రోజులు వానలు కురిసే అవకాశం

### పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

**హైదరాబాద్, మే 15 (నిఘా న్యూస్):** తెలంగాణలో వాతావరణం క్రమేపీ చల్లబడుతోంది. ఎండల తీవ్రత తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు.. ప్రస్తుతం 40 డిగ్రీలకు పడిపోయింది. దీనికి కారణంగా ఉపరితల ఆవర్తనమే అని అంటున్నారు వాతావరణ శాఖ అధికారులు. మహారాష్ట్రలోని పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో అవర్తనం ఏర్పడిందని.. దీని కారణంగారాష్ట్రంలోవచ్చేమూడురోజులపాటువర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరువర్షాలుకురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, 30-40కిమీవేగంతోఈదురుగాలులతోకూడిన వర్షాలు తెలంగాణలోని ఆదిలాబాద్,కొమరంభీంఆసిఫాబాద్,మంచిర్యాల,నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.గురువారం.. ఉరుములు, మెరుపులు, 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులతో కూడినవర్షాలు తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. అలాగే ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. శుక్రవారం.. ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. గత ఏడాదిలా కాకుండా ఈసారి తెలుగు రాష్ట్రాలను గట్టిగా పలకరిస్తామంటున్నాయి నైరుతి రుతుపవనాలు. విపరీతమైన ఎండలు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి పలకరిస్తుందంటోంది. ఈనెల 19వ తేదీన అండమాన్ నికోబార్ దీవులను నైరుతి రుతు పవనాలు తాకుతాయి. ఆ తర్వాత కేరళను పలకరించి.. తెలుగు రాష్ట్రాలకు చల్లని మబ్బులు దూసుకొస్తాయి. గత ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయిన నేపథ్యంలో.. ఈసారి రుతు పవనాలు ఎలా ఉండబోతున్నాయి? వర్షాలు సమృద్ధిగా పడతాయా? సాధారణంగా ఉంటాయా? ఇప్పుడు ఇదే ఉత్కంఠ రేపుతోంది. అయితే ఈసారి వర్షపాతం బాగా నమోదవుతుందని చెబుతోంది వాతావరణ శాఖ. ఎల్ నినో ప్రభావం తగ్గి, లా నినో ప్రభావం రాబోతుండడం దీనికి దోహదం చేస్తుందంటున్నారు అధికారులు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఇప్పటికే ఐఎండి అంచనా వేసింది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉంటాయని, వర్షాలు కురిసేందుకు అనువైన వాతావరణం ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ ఏడాది ప్రస్తుతానికి అనుకూల పరిస్థితులే ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తొలకరి పలకరింపు కోసం తెలుగు రాష్ట్రాలు తెగ ఎదురు చూస్తున్నాయి.

# సికింద్రాబాద్ లో.. పెరిగిన పోలింగ్ ఎవరికి లాభం..!

- 2019లో 46.26 శాతం, అప్పటి కంటే 2.78 శాతం అధికంగా పోలింగ్
- జూబ్లీహిల్స్, నాంపల్లి, సనత్ నగర్, సికింద్రాబాద్ లో ఎక్కువగా నమోదైన పోలింగ్
- అంబర్ పేటలో గతం కంటే తక్కువగా పోలింగ్

**అంబర్ పేట, మే 15 (నిఘా న్యూస్):** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో పోలింగ్ 49.04 శాతంగా నమోదైంది. 2019లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఈ శాతం 46.26గా ఉంది. ఈ క్రమంలో గత పార్లమెంట్ ఎన్నికల కంటే 2.78 శాతం పోలింగ్ ఈసారి ఎక్కువగా నమోదైంది. ఈ పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి లాభం చేకూర్చనుందోనని సర్వత్ర చర్చ జరుగుతున్నది. లోక్ సభ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా ఉంది. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో మొత్తం ఓట్లు 2,87,029 ఓట్లు ఉండగా 1.38, 971 ఓట్లు పోలయ్యాయి. అంటే 48.42 శాతం నమోదైంది. 2024లో మొత్తం ఓట్లు 3,07,995 ఓట్లు ఉండగా, 1,51,195 ఓట్లు పోలయ్యాయి. అంటే 49.09గా నమోదైంది. కేవలం 0.67 శాతం మాత్రమే ఎక్కువ పోలింగ్ జరిగింది.అంబర్ పేట అసెంబ్లీ పరిధిలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో మొత్తం ఓట్లు 2,50,305 ఉండగా.. 1,31,905 ఓట్లు పోలయ్యాయి. అంటే 52.70 శాతం నమోదైంది. 2024లో మొత్తం ఓట్లు 2,79,924 ఓట్లు ఉండగా..1,44,581 ఓట్లు పోలయ్యాయి. 51.65 శాతం పోలింగ్ నమోదైంది. ఇప్పుడు 1.05 శాతం తక్కువ పోలింగ్ జరిగింది. ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో 2,75,391 ఓట్లకుగానూ 1,36,352 ఓట్లు పోలయ్యాయి. 49.53 శాతం నమోదైంది. 2024లో 2,99,651 ఓట్లు ఉండగా..1,50, 665 ఓట్లు పోలయ్యాయి. 50.28 శాతం నమోదైంది. అంటే 0.75 శాతం ఎక్కువగా పోలింగ్ జరిగింది.జుబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో 3,55,319 ఓట్లు ఉండగా 1,41,400 ఓట్లు పోలయ్యాయి. 39.80 శాతం పోలింగ్ జరిగింది. 2024లో 3,87,056 ఓట్లకుగానూ 1,76,459 ఓట్లు పోలయ్యాయి. 45.59 శాతం నమోదైంది. ఇక్కడ 5.79 శాతం అధికంగా పోలింగ్ నమోదైంది. ఈ శాతం ఎవరికి లాభం చేకూర్చనుందో అనేది సర్వత్ర చర్చనీయాంశామైంది. సనత్ నగర్ అసెంబ్లీ పరిధిలో2019లో ఈ నియోజకవర్గంలో మొత్తం 2,41,880 ఓట్లు ఉండగా...1,16,021 ఓట్లు నమోదయ్యాయి. అంటే 47.97 శాతం




నమోదైంది. 2024లో 2,53,381 ఓట్లు ఉండగా...1,25,297 ఓట్లు పోలయ్యాయి. ఇప్పుడు 49.45 శాతం నమోదైంది. అంటే 1.48 శాతం అధికంగా నమోదైంది.నాంపల్లి అసెంబ్లీ పరిధిలో 2019లో మొత్తం ఓట్లు 3,09,333 ఉండగా...1,19,916 ఓట్లు పోలయ్యాయి. 38.77 శాతం పోలింగ్ నమోదైంది. 2024లో 3,26,057 ఓట్లు ఉండగా...1,51,910 ఓట్లు పోలయ్యాయి. అంటే 46.59 శాతం నమోదైంది. ఇక్కడ 7.82 శాతం అధికంగా పోలింగ్ జరిగింది.సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలో 2019లో మొత్తం ఓట్లు 2,48,980 ఓట్లు ఉండగా.. 1,25,872 ఓట్లు పోలయ్యాయి. అంటే 50.56 శాతం పోలింగ్ నమోదైంది. 2024లో 2,66,337 ఓట్లకుగానూ 1,39,774 ఓట్లు పోలయ్యాయి. అదే శాతానికి వస్తే 52.48 శాతం నమోదైంది. ఇప్పుడు 1.92 శాతం అధికంగా పోలింగ్ జరిగింది.2019లో మొత్తం ఓట్లు 19,68,147 ఓట్లు ఉండగా..9,10,437 ఓట్లు పోలయ్యాయి. అప్పుడు 46.26 శాతం నమోదైంది. 2024లో మొత్తం ఓట్లు 21,20,401 ఓట్లు ఉండగా..10,39,879 ఓట్లు పోలయ్యాయి. అంటే 49.04 శాతం పోలింగ్ నమోదైంది. ఇప్పుడు 2.78 శాతం అధికంగా పోలింగ్ జరిగింది.

# రోగాలను పంచి పెడుతున్న హోటల్లు

### తనిఖీలు మరిచిన అధికారులు





**అంబర్ పేట, మే 15 (నిఘా న్యూస్):** అంబర్ పేట పరిసరాల్లోని హోటళ్లలో కడుపారా భోజనం చేయాలంటే ఒకింత ఆలోచించాల్సి వస్తుంది. రద్దీగా ఉండే ఈ ప్రాంతం హోటళ్లు, దాబాలు, కర్రీ పాయింట్లు, రెస్టారెంట్లకు అడ్డాగా మారింది. డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకుంటున్న హోటళ్ల నిర్వాహకులు శుచి శుభ్రతను గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పు వాటిల్లుతోంది. ఇక్కడి హోటల్లో శుచి, రుచితో కూడిన భోజనం పెట్టాల్సిన నిర్వాహకులు కలుషిత భోజనాన్ని వడ్డించి అడ్డగోలు రోగాలకు అజ్యం పోస్తున్నారు. కుళ్లిన ఆహార పదార్థాలనే మళ్లీ మళ్లీ తయా రు చేసి కల్తీ దందాకు తెరలేపుతున్నారు.రంగురంగుల రసాయనాలు కలుపుతూ ఆకర్షణీయంగా రకరకాల పేర్లతో వంటలు తయారు చేసి కాసులు మూటగట్టు కుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రశ్నించేవారు లేకపోవడంతో హోటల్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాగునీటి నుంచి తినే ఆహారం దాకా ఎక్కడ కూడా శుభ్రతను పాటించడం లేదని కస్టమర్లు ఆందోళనకు గురవుతున్నారు. వెయిటర్లు సైతం కనీస జాగ్రతలు పాటించకపోవడం వల్ల అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శరీరానికి యాప్రాన్, తలకు క్యాప్, నోటికి మాస్క్, చేతులకు గ్లాజు ధరించకుండా ఆహారపదార్థాలు వడ్డిస్తున్న పట్టించుకునే దిక్కులేదని మాస్టార్లు పాన్ పరాగ్, గుట్కా లు నములుతూ వంటలు చేయడం ఇక్కడ సర్వ సాధారణమైందని కస్టమర్లు చెబుతున్నారు. అదే విధంగా టీ విక్రయ కేంద్రాల్లో తయారు చేసే సమోసాలు, మిఠాయిలు, ఇతర ఆహారపదార్థాలపై ఈగలు, దోమలు,ఇతర క్రిమికీటకాలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవడం లేదని వారు అంటున్నారు. అంబర్ పేట లో హంగు ఆర్భాటాలతో అట్టహాసంగా దర్శనమిస్తున్న హోటల్లో కల్తీ దందా జోరుగా కొనసాగుతున్న జిహెచ్ఎంసి వైద్య ఆరోగ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. హోటళ్లలో పనిచేసే వారు వ్యక్తిగత పరిశుభత పాటించకపోవడం, వంటకాల తయారీలో కల్తీ ఆహార వస్తువులు వినియోగించడం లాంటి ఆక్రమాలు ఇక్కడ షరా మామూలు అయిపోయాయి. నాలుగు నెలల క్రితం గోల్నాక గంగానగర్ లోని ఆగ్రావాలా స్వీట్ హౌస్ లో నిర్వాహకులు బొద్దింకలతో కూడిన సమోసాలను కస్టమర్ కు విక్రయించడంతో అతని కుటుంబ సభ్యులకు వాంతులు విరోచనాలు అయ్యాయి. దీనిపై ఫిర్యాదు రావడంతో జిహెచ్ఎంసి సర్కిల్ 16 వైద్య ఆరోగ్య విభాగం అధికారులు స్వీట్ హౌస్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దుకాణాన్ని సీజ్ చేశారు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ నెల రోజులకే తిరిగి నిర్వాహకులు స్వీట్ హౌస్ ను తెరిచి వ్యాపారాన్ని ప్రారంభించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే చే నంబర్ షర్టన్ హోటల్ లో అధికారులు తనిఖీ చేసి ఆహార కల్తీ వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. ఈ సందర్భంగా కుళ్లిన మాంసాహారాన్ని, ఫ్రీజర్లలో నిల్వ ఉంచిన మాంసం, రసాయనాలు కలిపిన ఆహార పదార్థాలు అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ అధికారిణి, ఫుడ్ ఇన్స్పెక్టర్ లు గుర్తించారు. తాజాగా బతుకమ్మ కుంట ధ్రువ్ ఏలెట్ హోటల్లో భోజనం చేస్తున్న ఓ పాత్రికేయుడికి సాంబార్ లో రబ్బర్ బ్యాండ్ వచ్చింది.

## ఇండియా కూటమిదే అధికారం

### మీడియా సమావేశంలో మల్లికార్జున ఖర్గే

**లక్నో, మే 15 (నిఘా న్యూస్):** నాలుగు విడతల్లో జరిగిన పోలింగ్ తమకే అనుకూలంగా ఉందని, దేశ ప్రజలు మోదీకి వీడ్కోలు పలకాలని నిర్ణయించారని, ఓటు ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. లక్నోలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేవని అన్నారు. మన భవిష్యత్ తరాలు, వాళ హక్కులు, రిజర్వేషన్లను రక్షించడానికి ప్రజలు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై ఇండియా అలయన్స్ పోరాడుతోందని చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షిస్తేనే ప్రజలకు హక్కులుంటాయని అన్నారు.ఓటు ఉంటే ఎవరినైనా ప్రజాస్వామ్యంలో ఎన్నుకోగలమని అన్నారు. నియంతృత్వం, నిరంకుశత్వం ఉంటే ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుందని అన్నారు. బీజేపీకి బలం ఉన్న చోట తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ఆపి ఏజెంట్లను మభ్యపెడుతున్నారని అన్నారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి బురఖాపై కన్నేశారని గుర్తు చేశారు. దేశానికి ఎన్నో ఇచ్చామని చెబుతూ బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.'గాంధీజీ స్వాతంత్ర్యం తెచ్చారు, నెహ్రూజీ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని సృష్టించారు.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారు..'అని అన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడుతున్నా మోదీ మౌనంగా కూర్చున్నారని, అలా మాట్లాడటం దేశద్రోహమని అనలేదని ఆరోపించారు.

## గర్భంలో పిండానికి కూడా జీవించే హక్కు

### చట్టానికి విరుద్ధంగా ఉత్తర్వులను జారీ చేయలేం

### అవివాహిత పిటిషన్‌పై సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 15 (నిఘా న్యూస్): గర్భంలోని పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 27 వారాల గర్భాన్ని తొలగించాలని 20 ఏళ్ల అవివాహిత దాఖలు చేసిన పిటిషన్‌ని స్వీకరించేందుకు సుప్రీంకోర్టు ఈ రోజు నిరాకరించింది. మే 3న తన గర్భాన్ని తొలగించేందుకు నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతత్వంలోని ధర్మాసనం విచారిస్తున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మేము చట్టానికి విరుద్ధంగా ఏ ఉత్తర్వులను జారీ చేయలేము అని ధర్మాసనం స్పష్టం చేసింది.కడుపులోఉన్నబిడ్డకుకూడాజీవించేహక్కు ఉంటుందని, దాని గురించి మీరు ఏం అంటారు..? అని మహిళ తరుపు న్యాయవాదిని ప్రశ్నించింది. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం కేవలం తల్లి గురించి మాత్రమే మాట్లాడుతుందని మహిళ తరఫు న్యాయవాది తెలిపారు. ఇది తల్లుల కోసం తయారు చేయబడిందని చెప్పారు. గర్భం దాల్చి 7 నెలలకు పైగా అయిందని ధర్మాసనం పేర్కొంది. పిల్లల మనుగడ హక్కు పరిస్థితి ఏంటి..? దీనిని మీరు ఎలా పరిష్కరిస్తారు..? అని బెంచ్ ప్రశ్నించింది. పిండం కడుపులో ఉందని, బిడ్డ ప్రసవించే వరకు అది తల్లి హక్కు అని న్యాయవాది ధర్మాసనానికి చెప్పారు. "ఈ దశలోపిటిషనర్ తీవ్రమైన బాధాకరమైన పరిస్థితుల్లో ఉన్నారని, ఆమె బయటకు కూడా రాలేదు, ఆమె నీట్ పరీక్ష కోసం క్లాసెస్‌కి వెళ్తుందని, ఆమె చాలా బాధాకరమైన స్థితిలో ఉన్నారు. ఆమె ఈ దశలో సమాజాన్ని ఎదుర్కోలేకపోతోంది" అని న్యాయవాది చెప్పారు. ఆమెమానసిక,శారీరకశ్రేయస్సును పరిగణలోకి తీసుకోవాలని న్యాయవాది వాదించారు.ఏప్రిల్25నపిండం, పిటిషనర్ పరిస్థితిని నిర్ధారించడానికి మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని ఎయిమ్స్‌ని ఆదేశించామని, మే 3న తన ఉత్తర్వుల్లో హైకోర్టు పేర్కొంది. మెడికల్ బోర్డు నివేదిక ప్రకారం.. పిండంలో పట్టుకతో వచ్చే అసహజత ఏం లేదని, గర్భాన్ని కొనసాగించడం వల్ల తల్లికి ఎలాంటి ప్రమాదం లేదని హైకోర్టు పేర్కొంది. కాబట్టి భ్రూణ హత్య నైతికంగా, చట్టపరంగా అనుమతించబడదు అని చెప్పింది. పిటిషనర్ హైకోర్టు ముందు తన కడుపులో అసౌకర్యంగా అనిపించిందని ఏప్రిల్ 16న పేర్కొంది. అల్ట్రాసౌండ్ స్కాన్ చేయగా, ఆమె 27 వారాల గర్భవతి అని తేలింది. ఇది చట్టబద్ధంగా అనుమతించే 24 వారాల పరిమితిని దాటిపోయింది. చట్టం ప్రకారం, వైద్య బోర్డు ద్వారా పిండం అసాధారణంగా ఉండటం లేదా తల్లికి ప్రమాదం పొంచి ఉన్నప్పుడు మాత్రమే 24 వారాల కన్నా ఎక్కువ వ్యవధి గర్భాన్ని రద్దు చేయడానికి అనుమతించబడుతుంది.

## డా. నరేంద్ర దబోల్కర్ హంతకులను కఠినంగా శిక్షించాలి

### భారత నాస్తిక సమాజం



**పాలకుర్తి మే 15 (నిఘా న్యూస్):** ప్రముఖ హేతువాది, మానవతావాది డాక్టర్ నరేంద్ర దబోల్కర్ ను హత్య చేసిన దుండగులను అత్యంత కఠినంగా శిక్షించి మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని భారత నాస్తిక సమాజం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2013 ఆగస్టు 20న మహారాష్ట్రలోని ఓంకారేశ్వర బ్రిడ్జి పై మార్నింగ్ వాక్ చేస్తున్న నరేంద్ర దబోల్కర్ ను సంఘ పరివార్ గుండాలు అత్యంత పాశవికంగా కాల్చి చంపైన వారిని పూణేలోని ప్రత్యేక కోర్టు సచిన్ అందూలే, శరత్ కళాస్కర్లకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు కీలక తీర్పు ఇచ్చిందన్నారు. కీలక సూత్రధారులైన వీరేంద్ర తలాకే, అడ్వకేట్ సంజీవ్ పునలేకర్,విక్రమ్ భావే లను నిర్దోషులుగా విడుదల చేసింది .వారిపై నేరాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనందునే తప్పించే కుట్ర జరిగిందని భారత నాస్తిక సమాజం ఆరోపించింది, అసంతృప్తి వ్యక్తం చేసింద. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాటం చేసిన దబోల్కర్ తన మరణానంతరం అక్కడి ప్రభుత్వం మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేసిందని సాంబయ్య గుర్తు చేశారు. అయితే ప్రధాన నిందితులను తప్పించే కుట్రకు తెరలేపటం న్యాయస్థానాల మీద ప్రజలకు నమ్మకం తగ్గే అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. అందుకని కీలక సూత్రధారులను శిక్షించుట కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయవలసిందిగా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- అకాల వర్షాలతో తడిసిన ధాన్యం
- పలుచోట్ల వర్షానికి కొట్టుకుపోయిన లినష్టం
- ప్రకటనలే తప్ప కానరాని కార్యాచరణ
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ అన్నదాతలు
- బీబీనగర్ వద్ద జాతీయ రహదారిపై ధర్నాతో నిలిచిపోయిన ట్రాఫిక్

**హైదరాబాద్. మే 15 (నిఘా న్యూస్):** వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం సాగుతుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వరిధాన్యం తడిసి ముద్దయ్యింది. అంతేకాకుండా తేమ శాతం కూడా పెరిగింది. అకాల వర్షాలతో పలు జిల్లాల్లో ధాన్యం తడిసింది. కల్లాల్లో పోసిన ధాన్యంతో పాటు, మార్కెట్ యార్డుల్లోనూ ధాన్యం తడిసి ముద్దయ్యింది. పలుచోట్ల కొట్టుకు పోయింది. దీంతో రైతులు లబోలదిబోమంటున్నారు. ధన్యం కొంటామని అంటున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో అధికారులు జాప్యం చేస్తున్నారు . దీంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా.. వరిధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అకాల వర్షాలు కురిశాయి. దీంతో ఐకెపి కేంద్రాల వద్ద వరిధాన్యం తడిసి పోయింది. ఇప్పటికీ కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. అంతేకాకుండా తేమ శాతం పెరిగిపోయింది. దీంతో తేమ శాతం ఆధారంగానే ధాన్యాన్ని కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే.. తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో రైతులు ఆందోళన చేశారు. తడిసిన పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 20 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకొచ్చినా కొనుగోలు చేయడం లేదని రైతులు రోడ్కెక్కారు. అదే విధంగా పరిధాన్యం తడిసిపోవడంతో తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకొని కొనుగోలు చేస్తున్నారు. ఇంకా 20 శాతం వరకు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు నాతవరణం కూడా మారిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రానున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభంకానుంది. వెంటనే.. పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల వరిధాన్యం కొనుగోలు చేసినా.. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఈ నాలుగైదు రోజుల్లో వరిధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అధికారులు మాత్రం ఎలాంటి ఆందోళన చెందవద్దని రైతులకు సూచిస్తున్నారు. పూర్తి స్థాయిలో పరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. సకాలంలో వరిధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అకాల వర్షాల కారణంగా వరిధాన్యం తడిసిపోయిందని రైతులు చెబుతున్నారు. తేను శాతం పేరుతో సరిగా కొనుగోలు చేయడం లేదని అంటున్నారు. వెంటనే పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనేకచోట్ల ఇదే పరిస్థితి ఉండడంతో ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి పంటలు పండిస్తే ప్రభుత్వం కోనుగోలు చేయక పోవడంతో ప్రభుత్వంపై మండి పడుతున్నారు.కండ్లముందేపంటలు పాడవుతున్నా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు ఆందోళన బాటపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తూ, రోడ్లపై బైఠాయిస్తూ తమ నిరసనను తెలుపుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో అన్నదాతలు ఆందోళన బాటపట్టారు. నెల గడుస్తున్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు, బుధవారం బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. స్థానిక తహసీల్దార్ శ్రీధర్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, అంతకుముందు భువనగిరి మండలం పచ్చళ్లపాడు తండా గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వడ్లు కొనకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఈత చెట్లను దగ్ధం చేసిన దుండగులు

### ఘటనాయి స్థలాన్ని పరిశీలించిన గౌడ సంఘాల నేతలు



**పెబ్బేరు, మే 15 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండలంలో ని కంచిరావుపల్లి గ్రామ శివారులోని ఈత వనాన్ని గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా గౌడ సంఘాల జెఎసి ఛైర్మన్ రామన్ గౌడ్,వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మండల గౌడ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచే వీడియో కాల్ ద్వారా ఎక్సైజ్ సీఐకి పరిస్థితి చూపించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు.

## నౌకల నిర్మాణం హిందుస్థాన్ షిప్ యార్డ్ లో చేపట్టాలి




**విశాఖపట్నం, మే 15 (నిఘా న్యూస్):** ఫ్లీట్ సపోర్ట్ నౌకల నిర్మాణం హిందుస్థాన్ షిప్ యార్డ్ లో చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగానికి అవసరమైన ఐదు ఫ్లీట్ సపోర్ట్ నౌకలను సుమారుగా 20 వేల కోట్లు కేటాయిస్తే హిందుస్థాన్ షిప్ యార్డ్ యాజమాన్యం ఇందులో 2 ఫ్లీట్ సపోర్ట్ నౌకల నిర్మాణం రాజకీయ ఒత్తిడితో ఎల్ అండ్ టి కి ఇవ్వడాన్ని సిఐటియు ఖండించారు. ఈ చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు.

## ఐపీఎల్ మ్యాచ్ కోసం... నేడు అదనపు బస్సులు



**ఉప్పల్, మే 15(నిఘా న్యూస్):** ఐపీఎల్ అభిమానులకు టి ఎస్ ఆర్ టి సి శుభవార్త చెప్పింది. ఐపీఎల్ ఫ్యాన్స్ కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రకటించింది. గురువారం ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్, గుజరాత్ మధ్య మ్యాచ్ సాయంత్రం ఏడున్నర గంటలకు జరగనుంది. దానిని దృష్టిలో పెట్టుకొని జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 60 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. మే 16న ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11.30 గంటల మధ్య వీటిని నడపనుంది.

## గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల తేదీల ఖరారు

### బీసీ స్టడీస్ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి



**ముస్తాబాద్, మే 15 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్లో గ్రూప్-1 యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) ఎగ్జామినేషన్ 2024 ఆఫ్ లైన్ లో గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలియజేశారు. టిఎస్పిఎస్సి గ్రూప్- 1 అభ్యర్థులకు ఆఫ్ లైన్ పద్ధతిలో బీసీ స్టడీ సర్కిల్ లో గ్రాండ్ టెస్టులు నిర్వహించబడును. అలాగే యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్2024 అభ్యర్థులకు కూడా గ్రాండ్ టెస్ట్ లు వివిధ తేదీల్లో నిర్వహించడం జరుగుతుంది. గ్రాండ్ టెస్టులకు హాజరు కావడానికి అభ్యర్థులు (www.tsbcstudycircle.cgg.gov.in) ఈ వెబ్ సైట్లో ఆన్ లైన్ దరఖాస్తు చేసుకోవాలి. మరింత సమాచారం 9381888749, 7702650209 పైన తెలిపిన మొబైల్ నెంబర్లను సంప్రదించగలరని. విద్యార్థులకు డైరెక్టర్ వెంకటస్వామి సూచించారు.

# జగ్గారెడ్డివి పిట్టలదొర మాటలు

### మీడియా లో టైమ్ పాస్ మాటలకే పరిమితం
### అర్థం పర్థం లేని మాటలతో కాంగ్రెస్ పరువు గంగ లోకి
### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెమలి కొండ వేణు మాధవ్



**సంగారెడ్డి, మే 15(నిఘా న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరువు తీయడంలో టి పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి ముందు వరుసలో ఉంటారని, అతని మాటల్లోనే అతని అవివేకి తనం బయట పడుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెమలి కొండ వేణు మాధవ్ పేర్కొన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ బిజెపి రాజ్య సభ సభ్యుడు డా. లక్ష్మన్ పై అర్థం పర్థం లేని మాటలు మాట్లాడటం సరికాదని బిజెపిని విమర్శించే స్థాయి జగ్గారెడ్డికి లేదనీ అన్నారు. అతని మాటలు రాష్ట ప్రజలు తిరస్కరిస్తూన్నారని తెలిపారు. అధికార మదంతో ఆయన మాట్లాడుతున్నారు తప్ప మరొకటి లేదని అన్నారు. సంగారెడ్డిలో చెల్లని రూపాయి గాంధీ భవన్ లో ఎలా చెల్లుతారని ప్రశ్ని%శీ%చారు. మీడియాలో సన్నాయి నోక్కులు నొక్కిన ప్రజలు హర్షించడం లేదనీ అన్నారు. అతని మాటలతో ఒరిగేది ఏమి లేదని తెలిపారు. అతని మాటల్లో సబ్జెక్టు ఉండదని ఇష్టం వచ్చిన మాటలు మాట్లాడి స్వంత పార్టీ పరువు తీస్తున్నారని పేర్కొన్నారు. అన్ని టైమ్ పాస్ మాటలే తప్ప మరొకటి లేదని తెలిపారు. 15 ఏండ్లు ఎమ్మెల్యేగా అధికారం ఇస్తే సంగారెడ్డిలో కనీసం డంపు యార్డు ఏర్పాటు చేయాలని అసమర్థుడు జగ్గారెడ్డి తెలిపారు. అందుకే సంగారెడ్డి ప్రజలు దూరం పెట్టారని అన్నారు. అధికారం కోల్పోయి మతి భ్రమించి మాట్లాడు తున్నారని పేర్కొన్నారు. బిజెపి మోది పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చే%శీ%దు తుందని అన్నారు. దేశం ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసింది కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేస్తే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే వారని తెలిపారు. దేశం అభివృద్ధి విరోధులు కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇబ్బందులను గురిచేస్తున్నారు తప్ప మరొకటి లేదని అన్నారు. ఏనాడు ప్రజలకు అందుబాటులో లేని వ్యక్తి బిజెపి విమర్శించడం తగదని అన్నారు. జగ్గారెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది బిజెపి పార్టీ అని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. రాష్ట ప్రజలు అబద్ధాల కాంగ్రెస్ ప్రభుత్వం మాటలను గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కి మనస్తత్వం జగ్గారెడ్డి ఉందని అన్నారు. దయ్యాలు వేదాలు వల్లించడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ సునామీ రానున్నది వాస్తవమేనన్నారు. ఇతర పార్టీలను తిడితే లీడర్ కారని తెలిపారు. జగ్గారెడ్డి అంటే ప్రజలు తిరస్కరిస్తున్నారని అందుకే పేరు కోసం గాంధీ చిట్ చాట్ చేస్తున్నారని తెలిపారు. మోదీ మళ్ళీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలు బిజెపి భారీ మెజారిటీ గెలవడం ఖాయమని తెలిపారు. బిజెపిపై విమర్శలు మని సంగారెడ్డి అభివృద్ధి కోసం కృషి చెయాలని తెలిపారు.

## సామ్రాజ్యలక్ష్మి అవతారంలో.. భద్రకాళి అమ్మవారు

### పంచామృతాలతో అభిషేకం చేస్తున్న పూజారులు





**వరంగల్, మే 15 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి భద్రేశ్వర శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి నాలుగు గంటలకు నిత్యహనికం నిర్వహించిన తదుపరి చతుస్థానార్చన జరిపిన తర్వాత అమ్మవారికి గందోత్సవం సాయం కాలం సాలభంజిక వాహనంపై అమ్మవారిని సామ్రాజ్యలక్ష్మిగా అలంకరించి ఊరేగింపు జరిపారు. అమ్మవారికి చందనోత్సవం జరపడం వల్ల భక్తులకు శ్వాసకోశ సంబంధమైన చర్మ సంబంధమైన ఎలాంటి రుగ్మతలు ఉండవు శాలభంజిక వాహనం మీద 32 మంది దేవకన్యలు వేసే ప్రశ్నల వర్షానికి ప్రత్యుత్తరమిస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తన సర్వజ్ఞత్వాన్ని తెలుపుతుంది. సాలభంజిక వాహనం మీద సేవింపబడుతున్న అమ్మవారిని దర్శిస్తే సకల శక్తులు సమకూరుతాయి. విద్యా, ఐశ్వర్యం, పరా క్రమం, అధికారం అన్ని సమకూరుతాయి సామ్రాజైశ్వర్యం కలుగుతుందని ఆలయ ప్రధానార్చ కులు భద్రకాళి శేషు తెలిపారు. దేవాలయానికి చేసిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, చల్లటి త్రాగునీరు అమ్మవారి దర్శనం తదితర ఏర్పాట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి శేషు భారతి పర్యవేక్షించారు.

బుధవారం నాటి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర, వరంగల్ ఉమ్మడి జిల్లా కుమ్మరి సంఘం వారు ఉభయ దాతలుగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఉపాధ్యక్షులు ఆవునూరు రామ్మూర్తి, వరంగల్ జిల్లా అధ్యక్షులు రుద్రారపు కుమారస్వామి ప్రజాపతి కడారి ఓం ప్రకాష్ ప్రజాపతి తౌటి దేవేందర్ ప్రజాపతి, వడ్లూరి విష్ణు ప్రజాపతి, ఆకారపు రాజగోపాల్ ప్రజాపతి, ఆకారపు శ్రీనివాస ప్రజాపతి, వడ్లూరి సత్యం ప్రజాపతి, ఉర్సు కుమ్మరి సంఘం అధ్యక్షులు ఆవునూరి నాగరాజు, కందికొండ కుమారస్వామి తదితరులు పాల్గొనగా ఈ సేవలు మహా అన్నదానం దాదాపు 700మందికి అన్నదానం ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కుమ్మరి కుల ముఖ్యులు ఆమంచి నాగ పరిమళ ప్రజాపతి ఆమంచి రాజ్ ప్రదీప్ ప్రజాపతి ఆమంచి అనసూయ ప్రజాప్రతి సౌజన్యంతో నిర్వహించారు.

## జాతీయ అవార్డుకు ఎంపికైన రాఘవాపురం

**పాలకుర్తి, మే 15 (నిఘా న్యూస్):** నేషనల్ వాటర్ అవార్డు కోసం ఎంపికైన గ్రామాన్ని కేంద్ర బృందం బుధవారం ఆదర్శ గ్రామమైన రాఘవపురంలో పర్యటించినారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రౌండ్ వాటర్ బోర్డ్ సైంటిస్ట్ బిజయకేతన్ మహంతా చైతన్య డి.ఈ. సెంట్రల్ వాటర్ కమిషన్, వీరన్న ప్రాజెక్ట్ అధికారి డి.ఆర్.డి.వో జనగామ ఏ.రాములు ఎంపీడివో పాలకుర్తి నల్లా నాగిరెడ్డి ఎంపిపి ఎ.మంజుల ఎ.పి.ఓ. కె.శ్రీనివాస్ రెడ్డి జీవన్ కుమార్, స్పెషల్ అఫీసర్. చుక్క లింగయ్య కార్యాదర్శి వెంకటేశ్వర్లు ఈ.సి టీ ఎ ఎఫ్ ఎ తదితరులు పాల్గొన్నారు.




## గీత కార్మికుడి మృతి



**అబ్దుల్లాపూర్ మెట్, మే 15(నిఘా న్యూస్):** తాటి చెట్టు పైనుండి కిందపడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు , మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మజీద్ పూర్ గ్రామంలో నివాసం ఉంటున్న గండేటి సంతోష (38), బుధవారం ఉదయం సుమారు 6 గంటలకు తన భర్త గండేటి తేజ (50)గీత కార్మికుడు ఇద్దరం కలిసి రోజు మాదిరిగానే తాటి వనంకు తాటి కల్లు, ముంజలు తీయడానికి వెళ్లి అక్కడ తన భర్త బాటసింగారం గ్రామ పరిధిలో దొడ్డ శాంతి కుమార్ వ్యవసాయ భూమిలో ఉన్న తాటి చెట్టు ఎక్కుతూ సుమారు 6:30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి కింద పడిపోవడంతో తలకు, ఇతర భాగాలకు రక్త గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడని మృతుని భార్య ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హత్యకు గురైన అంగన్వాడీ టీచర్





**తాడ్వాయి, మే15 (నిఘా న్యూస్):** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపురం గ్రామంలో అంగన్వాడీ టీచర్ సుజాత (46) అనే మహిళ హత్యకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం సుజాత ఏటూరు నాగారం మండలం చిన్న బోయినపల్లి గ్రామానికి చెందినది కాగా కొన్ని సంవత్సరాలుగా కాటాపూర్ గ్రామంలో అంగన్వాడి టీచర్ గా విధులు నిర్వహిస్తున్నదని దీనితో యధావిధిగా మంగళవారం ఉదయం విధులుకు వచ్చి తిరిగి సాయంత్రం తన స్వగ్రామం కు బయలుదేరి వెళ్లిందని గ్రామస్తులు తెలిపారు. కాగా బుధవారం ఉదయం తాడ్వాయి మండల సమీపంలో అడవికి వెళ్ళిన కొందరు తునికాకు కూలీలకు సుజాత మృత దేహం కనిపించిందని ఆమె మెడకు పొడవైన టవలు చుట్టి ఉరి వేసినట్లు గుర్తించిన కూలీలు తాడ్వాయి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. కాగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సుజాత మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు తాడు, సెల్ ఫోన్ చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు ఫైల్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కారు చెట్టుకు ఢీ కొని వృద్ధ దంపతుల మృతి





**బోనకల్, మే 15(నిఘా న్యూస్):** ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట వద్ద ప్రధాన రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా వృద్ధ దంపతులు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే ఖమ్మంలోని మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన సూర్యనారాయణ, రుక్మిణి, మరో ఇద్దరు కలిసి బుధవారం కారులో బోనకల్ వైపు వెళు తున్నారు. ఈ క్రమంలో కారు ముష్టికుంట్ల వద్దకు రాగానే అతివేగంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరు యువకులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ప్రమాదాన్ని గమనించిన అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. క్షతగాత్రులను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కాసేపటి తరువాత ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి ఈ ఘటనపై బోనకల్ ఎస్ఐ మధుసూధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాజన్న ఆలయ పనులను.. పరిశీలించిన కలెక్టర్

### జూన్ 15 వ తేదీ లోగా గుడి చెరువు పనులు పూర్తి చేయాలి
### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**వేములవాడ, మే 15 (నిఘా న్యూస్):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి స్వామి గుడి చెరువు అభివృద్ధి పనులు అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గుడి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ చెరువు ఆవరణలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో బండ్ పార్క్ లో కొనసాగుతున్న నిర్మాణాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్, ఇతర నిర్మాణ పనులను మ్యాప్ లు పరిశీలించి, క్షేత్రస్థాయి లో తనిఖీ చేశారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించి పనులు సంప్రదాయ బద్ధంగా, ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఉండాలని సూచించారు. పిల్లల ఆట స్థలాలు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేయాలని, రంగులు వేయించాలని ఆదేశించారు. వాకింగ్ ఏరియా, ఓపెన్ జిమ్ తదితర పనులన్నీ జూన్ 15 వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్మికుల సంఖ్యను పెంచి, పనులు త్వరితగతిన చేపట్టాలని పేర్కొన్నారు. నటరాజ విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు. సూర్య నమస్కార్ వద్ద మొక్కలు, గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్క్ ను కలెక్టర్ పరిశీలించి, మున్సిపల్



కమిషనర్ అన్వేష్ కు పలు సూచనలు చేశారు. ఇక్కడ టూరిజం సీఈ వెంకటరమణ, డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్ రెడ్డి, డీటీసీపీఓ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com